1 AALO1A150
H=7.0
W=4.8



# ఆడ జన్మ

నువు మాతల్లివి, అక్కవు, చెల్లెలివి, భార్యవు.

నువు ఆరోగ్యంగా ఉంటే మా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. నువు జ్ఞానసంపన్నురాలవయితే మేమంతా జ్ఞానవంతులమవుతాం.

అయితే మాకు ఆరోగ్యం అవసరంలేదు. జ్ఞానం అంతకన్నా అవసరంలేదు. మేం మతిమాలిన కర్షకులం; మా పొలానికి మేం మంచి ఎరువుతోలం, మా పొలాన్ని చక్కగా దున్ని పదునుచేసుకోనం, మా పొలానికి మేం కావలిసినంత నీరు కట్టం. మా పొలంమీద మాకు గౌరంలేదు. ఆ పొలంలో

అయిన తప్పా, తాలూ తిరిగి అంకలో నాటుతాం మా పంట దిగనాసిల్లిపోతుంది. పోనీ, మాకు విచారంలేదు. నువు మా బంజరు భూమివి.

నువు మా జీతంలేని నౌఖరువు. నీది ఇరవై నాలుగు గంటల నౌఖరీ. శలవుల్లేవు నీకు. డాక్టరు సర్టిఫికేట్లు లేవు. పింఛనులేదు. నువుచేతులు మారినా నీ నౌఖరీ మారదు.

జీవితం తన్నే తన్నులకు నీమీద మేం పగతీర్చుకుంటాం. పగవాడికి కూడా తెలియనివ్వని మాకుళ్లు నీ ఎదుట సిగ్గులేకుండా ప్రదర్శిస్తాం.

నీ ఋణం ఎట్లా తీర్చుకుంటాం? నువు మహా పతివ్రతవంటాం. నీకు స్వర్గమేగాని నరకం లేదంటాం నీ జన్మే ధన్యమైనదంటాం—నీ క్షుద్రమైన ఆడజన్మ!

నువు మా మాటలు నమ్మ నవసరంలేదు. నువు మామీద తిరుగుబాటు చెయ్యవచ్చు. కాని, జ్ఞాపకంఉంచుకో! నిన్ను మా సర్వశక్తులతోటీ ప్రతిఘటిస్తాం.

నీకు ఆత్మజ్ఞానం లేకుండా, చదువూ విజ్ఞానమూ లేకుండా చేసి ఉంచింది దేనికనుకున్నావు? నీకు అడుగడుగునా అంకుశాలు దేనికనుకున్నావు? నిన్ను అబలగాను, నీకీర్తి లేత తమలుపాకుకంటే సుకుమారంగాను, నీ మార్గం కంటక

భూయిష్టంగానూ, నీ జీవితం ఒక అంతంలేని అగ్నిపరీక్షగానూ ఉంచింది దేనికనుకున్నావు?

నీపట్ల మేమంతా మతాను శాసకులమే; అందరమూ గట్టి సామ్రాజ్యవాదులమే; అందరమూ పెట్టుబడుదార్లమే; అందరమూ గూండాలమే. అందర సాధువుల్లాగే, అమాయకుల్లాగే, అశక్తుల్లాగే, నీకుకూడా జీవితం ప్రశాంతగా వెళ్లాలని ఉంటుంది. ఘర్షణ నీకిష్టం ఉండదు.

మంచిది. అట్లా అయితే మాకు తలవొంచి ఉండు.

లేక ఎదురుతిరుగుతావా, నీ సంగతి మేంచూస్తాం. నీకు గౌరవంగా బతికే ఆస్కారంలేకుండా చేస్తాం నువ్వు సంఘంలో తల ఎత్తుకు తిరగటానికి లేకుండా చేస్తాం. నిన్ను పిచ్చికుక్కను వేటాడినట్టు వేటాడుతాం. ఈ లోకానికి నేతలం మేము ఈ జీవితానికి పెద్దరికం మాది. ఈ ప్రపంచంలో నీకు మిత్రుడెవడో కనుక్కోలేవు. పైకి అందరమూ నీ క్షేమం కోరినట్టే కనిపిస్తాం. పైకి, నీహృదయం అగాధమంటాం. యథార్థమైన అగాధాలు మా అంతరాత్మలు. ఎంతమంది అంతరాత్మల లోతులు తీరుస్తావు? నీ జీవితప్రమాణం ఎంత? నీకున్న అండ ఏమిటి?

ఇన్ని బందోబస్తులు చేసినా చివరకు నువేగెలుస్తావా?

అప్పుడు నిన్ను ఆకాశనికెత్తుతాం. నీకీర్తి ఆలపిస్తాం. నీకు మాకన్న ఆప్తులేలేరని రుజువుచేసుకుంటాం.

## 2

కొంతకాలం కిందట ఒక బస్తీలో, పాపం ఒక ఇల్లాలు కడుపున ఆడపిల్ల పుట్టింది. తొలి-చూలు కూడానూ. ఆ ఇల్లాలి భర్త పాపం, చాలా రోజులపాటు తల ఎత్తుకు తిరుగలేక పోయినాడు. ఆయన పరువంతా నట్టేట కలిసిపోయినట్టయింది. తనకన్న దరిద్రులూ, దౌర్భాగ్యులూ, దుర్మార్గులు సహితం మగపిల్లల్ని కంటూ ఉండగా తన భార్య తనకు ఆడపిల్ల నెందుకు కనిపెట్టాలో ఆయన కర్థంకాలేదు.

పురిటింట్లో ఎవరిమొహానా హాసరేఖ లేదు. ఎందుకుంటుంది?

"ఏం పిల్లమ్మా?"

"ఆఁ, ఆడపిల్ల! మా మొహానికింకేమవుతుంది?"

పాపం, వాళ్ళ మొహాలు చూస్తే ఇంట్లో ఒక పిల్ల పుట్టినట్టులేదు—పిల్ల పోయినట్టుంది గాని.

పురిటిగదిలో బాలింతరాలికీ సుఖంలేదు ఆవిడ అంత బాధాపడి కన్న కూతురికేసిచూస్తూ, ఇతరులనుకునే మాటలు వినవలిసి వచ్చేసరికి అమృతమూ విషమూ కలపి తాగి

నట్టయింది... ఈ పురుడు కన్నఇంటనే పోసుకుని ఉండవలిసింది—తన ఆఖరు తమ్ముడికి మశూచికం రాకుండా ఉంటే పుట్టింటివారు ఇంత అన్యాయంలేదు. తన అన్నగారికి మొదటి సంతానం ఆడపిల్లే. తన అక్కగారికీ ఆడపిల్లే. తన అక్కగారుకూడా తన తండ్రికి తొలిసంతే.

"అసలు వాళ్ళ సంప్రదాయమే అటువంటిదీ!" అన్నది ఆమె భర్తగారి ముత్తవ తల్లి. ఆవిడ కూతుళ్ళిద్దరూ వాళ్ళ కాలంలో తొలి చూలుకు ఆడపిల్లల్నే కన్నారు. కాని గురు వింద గింజ తన నలుపుగురించి ఎప్పుడన్నా ఆలోచిస్తుందా?

పదకొండోనాడు భారసాల. ఎవరికీ తెలీకుండా చేసు కున్నారు. దొంగతనంచేసినట్టు. అదే మగపిల్లవాడి భారసాల అయితే చుట్టాలందరికీ కోపం వచ్చి ఉండేదే కాని ఆడపిల్ల భారసాల కందర్నీ పిలిచి గొప్పగా చేసేదేమిటి?

పిల్లకు ఒక దేవుడిపేరూ, ఇద్దరు పితృ దేవతల పేర్లూ కలిసి వచ్చేటట్టు వెంకట సీతా మహాలక్ష్మి అని పేరు పెట్టు కున్నారు. చాలా వీలయిన పేరు. పాతకాలపు వాళ్ళు వెంకమ్మాఅనీ, మాచమ్మాఅనీ పిలవచ్చు నాగరికత బలిసిన వాళ్ళు సీతా అనీ, లక్ష్మీఅనీ పిలవొచ్చు.

"అసలు మావాడు భారసాలే చేసుకోనన్నాడు. పుణ్యాహవాచినానికి వచ్చిన బ్రాహ్మడి చేతనే నాలుగు

మంత్రాలు చదివించి నామకరణంకూడా నేనే చేయించా," అన్నాది పిల్ల నాయనమ్మ.

"కాదు మరి?... శాంతీ అదీ ఏమిలేదుకూడా గామాలు."

"అదో్కటే తక్కువయింది."

ఆచారం రీత్యా అయితేనేం, చట్టం రీత్యా నయితేనేం ఒకరికన్న తక్కువగా పుట్టటం చాలా శోచనీయం. అయినా మన సమాజంలో కొందరు తక్కువకులాల్లో పుడతారు, అనేక మంది బీదలకడుపున పుడతారు. మరికొందరు ఆడ వాళ్ళుగా పుడతారు.

అటువంటి సమాజం మనది.

దాన్ని మార్చే ఓపికా, శక్తీలేక, "ఎవరు చేసుకున్నంత వారికీ," అని మనస్సు సమాధానపరుచుకుంటాం. అప్పుడీ సమాజాన్ని చూసి గర్వించి, దీన్ని సమర్థించేటందుకు హోరాహోరి పోరాడే శక్తిమనకు ఎక్కడుంచో వచ్చి పడుతుంది.

## 3

లక్ష్మి తండ్రి దరిద్రుడు కాడు, అనాగరికుడు కాడు, ఆయనకి పదెకరాల పొలమూ, ఒక ఇల్లూ ఉంది. పాతకాలపు

మెట్రిక్యులేటు. తాలూకా కచ్చేరీలో గుమాస్తా.

అయినా లక్ష్మి దరిద్రుడి కూతురు, అనాగరికుడి కూతురు. ఆడపిల్ల మీద ఖర్చుచేసేటందుకు శివరామయ్య దగ్గిర డబ్బులేదు. ఆడపిల్ల మీద వినియోగ పరచటానికి సంస్కారమూలేదు.

పిల్లకి తల్లిపాలు చాలవు, డబ్బాపాలు పొయ్యాలి.

"డబ్బంతా దీని పాలకే చాలటంలేదు," అన్నాడు. పాపం ఆ అభాగ్యుడు.

డబ్బాపాలు సరిగా పడక పిల్ల నలతగా ఉండేది.

"ఇది రోగిష్టిముండ, పాలుకాక దీనిమొహానికి మందులు కూడా ఎక్కడపొయ్యను?" అనేవాడు శివరామయ్య.

"బతికే యోగం ఉంటే అదే బతుకుతుంది." అనేవాడు.

దీన్నిబట్టి శివరామయ్యకు సంస్కారములేదు, పశువు, అనుకో నవసరంలేదు. బంధువుల్లోనూ, స్నేహితుల్లోనూ ఎవరికైనా కాస్త పడిశెపుభారం చేస్తే ఎంతో సానుభూతి ప్రకటించి నాగరికు డనిపించుకోగలవాడే. కాని ఇంటిదగ్గిర, తన బిడ్డ విషయంలో—ప్రత్యేకించి ఆడపిల్ల విషయంలో— సంస్కారం ప్రకటించాలని ఎవరికుంటుంది? ఎందుకుంటుంది?

మనం ఎన్ని నటనలు చేసినా, ఎన్ని బురఖాలు వేసుకున్నా మనకుపైగా ఉన్నవాళ్ళకోసమే. అందుచేతనే మన యథార్థస్వరూపం బయటపెట్టేశక్తి మన కిందివాళ్ళకుంటుంది. ధనికుల నగ్నసత్యానికి సాక్షులు పీడిత ప్రజలు. మగవాళ్ళ నగ్నసత్యానికి సాక్షులు ఆడవాళ్ళు.

లక్ష్మికి మూడోఏట ఒక తమ్ముడు కలిగాడు. అప్పటికే లక్ష్మికి కొంత ఆత్మజ్ఞానముంది. తన ఆరోగ్యంకంటె తమ్ముడి ఆరోగ్యం ముఖ్యం. తనకంటె ఏకారణంచేనో తమ్ముడు ఎక్కువ. తమ్ముడు పెద్దవాడై చదువుకుంటాడు, ఉద్యోగాలు చేస్తాడు. డబ్బు సంపాదిస్తాడు, కట్నంపుచ్చుకుని పెళ్ళాడుతాడు. ఈ ఇల్లు తమ్ముడిది. ఈ ఆస్తంతా తమ్ముడిది. తనకు చదువుండదు. చదువుకుంటే ఆడవాళ్ళు చెడిపోతారు. తనతల్లి తండ్రీ మంచివాళ్ళు కనక తనకు ఇంటిపనులన్నీ నేర్పి, బోలెడంత కట్నంపోసి మొగుణ్ణితెస్తారు.

మూడేళ్ళ పిల్లకు ఇంత లోకజ్ఞానం అనవసరం. కాని ఈవిషయాలన్నీ అప్పటికే లక్ష్మికి చూచాయిగా తెలుసు. వాటినిగురించి ఆశ్చర్యపడే శక్తిగాని, ఆదుర్దాపడే శక్తిగాని లక్ష్మికిలేదు. అందుచేత ఈ విషయాలన్నీ లక్ష్మి ఆమోదించి చేసింది.

ఏమనిషిగానీ జీవితంలో దుర్భరమైన విషయాలు భరిం

చాలీ అంటే వాటినిగురించి ఆ మనిషికి పసితనంలోనే చెప్పె య్యండి బుద్ధి వికసించినతరవాత తెలుసుకోనీకండి.

లక్ష్మి తల్లి అసలే ఇంటిపనితోనూ బిడ్డడితోనూ సత మతమవుతున్నది. అటువంటప్పుడు లక్ష్మికికూడా సేవ ఎవరు చేస్తారు?

"పిల్ల ఇంకా రెండేళ్ళు పెద్దదైఉంటే చేతి కక్కరకొచ్చి ఉండేది. అది ఉందన్నమాటేగాని"-అనుకునేది తల్లి. ఇంకా లక్ష్మికి మూడోఏడే.

ఒకసారి లక్ష్మి తమ్ముణ్ణి అపేకగా ఎత్తుకోబోయి కిందజార్చింది. బిడ్డడు గుక్క పట్టి ఏడిచాడు. ఆరోజు లక్ష్మికి మొదటిసారి ఘాటయిన దెబ్బలు తగిలాయి. అప్పుడు లక్ష్మికి నాలుగోఏడు సగపడ్డది.

## 4

లక్ష్మి తల్లిదండ్రులు విపరీతపు మనుష్యులుగాని, దురాత్ములుగాని అయితే చెప్పుకోనవసరంలేదు. వాళ్ళు అనేకవిష యాల్లో అందరివంటివాళ్ళే. వారికి లక్ష్మిమీద ప్రత్యేకమైన పగాలేదు. అందుకే వారినిగురించి మనం చెప్పుకోవాలి.

అయిదో ఏడు వచ్చేసరికి లక్ష్మి ఇంటిపనులు చాలా చేస్తున్నది. తానై చేయలేనిపనుల్లో తల్లికి సాయపడుతున్నది. ఒకరోజు చిన్న నీళ్ళబిందె కాలిమీద పడేసుకుని వేళ్ళున

చితకగొట్టుకుని బిందె సొట్టపోగొట్టినందుకు తల్లిచేత దెబ్బలు తిన్నది. మరోరోజు కూరలు తరుగుతూ చెయ్యికోసుకున్నది. ఇంకోరోజు లక్ష్మి పరికిణాకి నిప్పంటుకున్నది......

వీటినిబట్టి లక్ష్మి ఏవిధంగా తల్లికి సాయపడిందీ మనం తెలుసుకోవచ్చు.

లక్ష్మి బాల్యంగురించి మన అభిప్రాయం ఏమైనా ఆమెకు మాత్రం జీవితం ఆనందమయంగా ఉండేది. పనిచేసి కష్టపడరాదనే భావం ఏమనిషిలోనూ సహజంగాకలదు. ఎంత కష్టపడి చేసేపని అయ్యినా చెయ్యగలపని చెయ్యటంలో ఏదో ఆనందం—తనబలాన్ని పరీక్షించుకుంటున్న తృప్తి—ఉంటుంది. ఆ తృప్తి లక్ష్మికివుండేది. లక్ష్మికి చెయ్యలేని పనంటే చెయ్యని పనే. పనివెంట వచ్చే కష్టాలూ, సరిగా చెయ్యకపోవటంవల్ల దాపరించే తిట్లూతిమ్మలూ బాల్యహృదయాన్ని దీర్ఘకాలం బాధించలేవు. పోతే, తనకులేని సౌకర్యాలకోసం పరితపించే గుణం ఏపిల్లకూ ఉండదు.

లక్ష్మికి చదువులేదు. చదువు లేకపోవటమంటే ఏమిటో తెలీదు. ఆమెకు చిరుతిళ్ళు అలవాటులేదు. ఆమె చూస్తుండగా చిరుతిళ్ళు తినే పిల్లలుకూడా ఎవరూలేరు. నూటికీ కోటికీ ఒకనాటకం ఆడేవాళ్ళు వాళ్ళ ఊళ్లో. అయితే మంచివాళ్ళు నాటకాలు చూడరని లక్ష్మి నమ్మకం; పోకిరీలే

నాటకాలు చూస్తారని. ఎప్పుడో ఒక బయస్కోపు వచ్చింది. ఆ బస్కోపుకు లక్ష్మిని ఒకసారి తీసుక వెళ్లారు. కృష్ణలీలలు. కృష్ణుడవేషం వేసింది తనవంటి పిల్లేట. ఆమాట విని లక్ష్మి చాలా సంతోషించింది. ఆ సినిమాగురించి పని లేనప్పుడల్లా తలుచుకుని ఎంతో ఆనందించేది.

అన్నిటినీ మించిన ఆరోగ్యం ఒకటి లక్ష్మికి పుష్కలంగా ఉంది. ఇప్పుడు ఇక లక్ష్మి కేం కావాలి?

లక్ష్మికి ఆరో ఏడు జరుగతూండగా శివరామయ్యగారి తల్లి పోయింది. చెడు నక్షత్రం. ఇల్లు పాడుతట్టి రెండు నెల్ల పాటు పొరిగింట్లో తలదాచుకున్నారు. ఆ యింటివారి పిల్ల హనుమాయమ్మకు సంగీతం మేష్టరు ఇంటికివచ్చి సంగీతం చెప్పేవాడు. లక్ష్మిలో ఏమూలో సంగీతం తృష్ణ పెట్టాడు. తడిక ఇవతలనుంచి రోజూ హనుమాయమ్మ చేసే సాధనా. మేష్టరు చెప్పే సంగీతమూ విని స్వరజతులూ, గీతాలూ అన్నీ పట్టేసి పాడసాగింది.

లక్ష్మి గొంతెత్తి పాడితే తల్లికి తేళ్ళూ జెర్రులూ పాకినట్టయేది. "నోరు మూసుకోవే!" అని కసిరేది. అప్పటికి నోర్ము మూసుకున్నా మరో పదినిమిషాలకి మళ్ళీలక్ష్మి స్వరజతులు లంకించుకునేది.

హనుమాయమ్మ తండ్రిగారు శివరామయ్య గారితో,

"మీా సీతది చాలా మంచి కంఠం. సంగీతం చెప్పించరాదా?" అన్నాడు.

శివరామయ్య ఒక్క-క్షణంపాటు నిర్జీవుడైపోయి "ఎందు కొచ్చిన సంగీతం? డబ్బుదండగ!" అన్నాడు.

తరవాత కొద్దికాలానికే కిష్టుణ్ణి బళ్ళోవేశారు. ఎవరికీ తెలియకుండా వాడితోబాటు లక్ష్మికూడా చదవటం నేర్చు కున్నది. అయితే ఆమెకు రాయటం చాతకాదు. అంట్లుతో ముతూ మసి వదిలేసమయంలో ఇత్తడి గిన్నెలమీాద అక్ష రాలురాసి చూసుకునేది. నల్లటిగిన్నె మసిలో పచ్చని బంగారు అక్షరాలుచూస్తే లక్ష్మికి వొళ్లు పొంగిపొయ్యేది. అన్నం గిన్నెమీాద మొదటిసారి తనపేరంతా "వెంకటసీతామహా లక్ష్మి" అని రాసి చూచుకున్నప్పుడు లక్ష్మి ఆనందానికి మేరలేదు. తరవాత "సీతా" అనే అక్షరాలుతప్ప మిగిలిన వన్నీ చెరిపేసి ఎట్లాఉందో చూసుకున్నది.

"ఆ గిన్నెలు చప్పున తోమిరాక ఆడుకుంటున్నావే మిటే? మసి వదలకపోయిందో, వీపు పెట్లగొడతా, తరవాత నీయిష్టం." అని తల్లి కేకపెట్టింది.

లక్ష్మి పెదిమలు బిగబట్టి గిన్నె పరపరా తోమసా గింది మట్టిపెట్టి.

## 5

లక్ష్మి పెండ్లి విషయం మొదటి ప్రస్తావన వచ్చిన నాటి కామెకు తొమ్మిది నిండి పదోయేడు వచ్చింది. అప్పటికి లక్ష్మి బట్టలుతకటం, వంట చెయ్యటం దగ్గిరనుంచీ ఇంటిపను లన్నీ చేస్తూఉంది. చెయ్యక గత్యంతరంలేదు. ఆమెతల్లి రోగి ష్టిదై మంచంలోనుంచి లేచి ఇంట్లో తిరగటమే గగనంగాఉంది. ఎవడైనా సమర్థుడైన వైద్యుడు పరీక్షిస్తే ఆమె క్షయవ్యాధితో బాధపడుతున్నట్టు అప్పుడే తెలిసిపోయిఉండును. కాని వైద్యు డికిబదులు దైవజ్ఞుడిదగ్గిరకి వెళ్ళటంవల్ల, జరుగుతున్న మహాదశ జబ్బుదశఅనీ, ఆజన్మాంతమూ ఆవిడ అంతో ఇంతో రోగంతో తీసుకోవలసిందేననీ తెలిపోయింది. చెప్పుకోతగినంత జ్వరం లేకపోవటంవల్లా, రోగి లేస్తూ కూచుంటూఉండటంవల్లా, తన కేమీరోగంలేదని వాదిస్తూఉండటంవల్లా ప్రత్యేక చికిత్స జరగ లేదు. ఆచారంప్రకారం కులదేవత అయిన తిరపతి వెంకటేశ్వ రస్వామికి ముడుపుకట్టుకుని మొక్కుకోవటం జరిగింది.

లక్ష్మికివచ్చిన ఈ సంబంధం అయినవాళ్ళలోదే. పెళ్ళి కొడుకు తండ్రి శివరామయ్యగారికి వేలువిడిచిన మేనమామ కొడుకు. అయిదు పదేళ్ళ కొకసారి కలుసుకున్నా, కలుసు కున్నప్పుడు అపేక్ష అంతఃకరణలు ప్రకటించుకోవటంఉంది. ఆ పెద్దమనిషి ఏదో వ్యాజ్యంమీదవచ్చి శివరామయ్యగారిం ట్లోనే బసపెట్టాడు. లక్ష్మి ఇంటిపని చూస్తూ చెయ్యటం

చూసి ముచ్చటపడ్డాడు. తన కొడుక్కి చేసుకోవాలనుకు న్నాడు. మంచి పనిమనిషి ఎవరికన్నా ఆకర్షిస్తుంది!

పిల్లవాడికి పద్నాలుగేళ్ళు. ఫోర్తుఫారం చదువుతు న్నాడు. పెద్ద భాగ్యవంతులుగారు. అయిదారెకరాల పొలం ఉంది. రెండు నిట్టాళ్ళ పూరిఇల్లున్నది. కట్నం ఇవ్వక్కర్లే కుండా ఈపెళ్ళి చెయ్యవచ్చుగాని, కాస్త ఇల్లూ వాకిలీకలవా ళ్ళకి పిల్లనిచ్చుకోగలిగితే కట్నం. ఇచ్చుకోవలసివస్తేమటు కేమని లక్ష్మి తల్లిదండ్రులు తమలో తామనుకున్నారు. ఇంటికివచ్చిన పెద్దమనిషితోమటుకు లక్ష్మి తల్లి ఆరోగ్యం బాగయేవరకూ ఏమీ అనుకోదలచలేదన్నారు.

మరుసటి సంవత్సరం లక్ష్మికి మరోసంబంధంవచ్చింది. ఈసారి అయినవాళ్లుకారుగాని చాలా భాగ్యవంతులు. పిల్ల వాడు కాలేజీలో ప్రవేశించాడు. ముప్పై ఎకరాల ఆస్తి. ఒక మేడవుంది. ఒక మామిడితోటకూడాఉంది. ఇంతఆస్తికీ ఒకడే కుర్రవాడు. పద్దెనిమిదోఏడు. చాలా బాగుంటాడు. బుద్ధిమం తుడు. కాని వాళ్ళకు కట్నం ఆశవుంది. రెండువేలడుగుతు న్నారు. మూడువేలు ఇస్తామని వచ్చినవాళ్ళుకూడా ఉన్నారు. అయితే కొందరు పిల్లలు నచ్చక, గొప్ప ఉద్యోగాలవాళ్ళతో సంబంధాలు ఇష్టంలేకా వాళ్ళు చేసుకోలేదు.

"రెండువేలే! ఎక్కణ్ణించి తీసుకురాను?...పిల్ల పెళ్ళి

కోసం పిల్లవాడినోట గడ్డకొట్టనా? నావల్లకాదు. చాతగాని ఎగుర్లెగిరి కాళ్ళు విరుచుకోవటంకంటె, ఏ బీదవాడిచేతిలోనే పిల్లను పెట్టెయ్యటం చాలామేలు. దాని అదృష్టం బాగుంటే పకీరుకిచ్చినా రాజాధిరాజవుతాడు." అన్నాడు శివరామయ్యగారు.

ఎన్నడూ కూతుర్నిగురించి గొంతెమ్మకోరికలు కోరి ఉండని తల్లికి ఈసారి ఈ సంబంధం అయితే బాగుండుననిపించింది. తమకన్న తక్కువఆస్తిగల సూర్యనారాయణగారు మామూలు సంబంధానికే పదిహేనువందలు కట్నంపోశారు. వాళ్ళకింకా ఇద్దరాడపిల్లలున్నారు.

"ఒక్కపిల్ల, పాపం, బతికున్నన్నాళ్లూ చెప్పుకుంటుంది. రెండెకరాలు తెగనమ్మిఅయినా ఈ సంబంధం చేద్దురూ!" అన్నది తల్లి.

శివరామయ్య పెళ్లానికేసి ఆశ్చర్యంగాచూశాడు. పదమూడేళ్లనుంచీ కాపరంచేస్తూ తన విశ్వాసాలకెన్నడూ విరుద్ధంగా మాట్లాడిఎరగనిమనిషి ఇప్పుడిట్లా మాట్లాడటం ఆయనకర్థంకాలేదు.

"నీకేమైనా మతిపోయిందా ఏమిటి? పిల్లవాడు ముష్టెత్తుకు తినాలనా నీ ఉద్దేశం?"

తనతో ఇంతకాలమూ కాపరంచేసి ఎన్నడూ ఒక్క

హక్కు కోసం పోట్లాడకుండా, తన విశ్వాసాలను అమలుజరిపిన పెళ్లాం చచ్చేముందు ఒక్క కోరిక కోరితే శివరామయ్య దాన్ని ప్రాచికపుడకను తోసేసినట్టు తోసేశాడు. ఐతే ఆయనకు విపరీతంగా ప్రవర్తించాననే జ్ఞానం అప్పుడుగాని, ఆతరవాతగాని కలగనేలేదు.

ఇది జరిగిన తొమ్మిదినెల్లకి లక్ష్మి పెళ్ళి నిశ్చయమయింది. పెళ్ళికొడుకు ముప్పైఏళ్ళవాడు. రెండో పెళ్ళి. వాళ్ళది పల్లెటూరు. నూరెకరాల ఆస్తి. లంకంత ఇల్లు. ఇద్దరే అన్నదమ్ములు. మొదటి సంబంధానికి ఒక మగపిల్లవాడు. వాడికి ఏడెనిమిదేళ్ళు. పెళ్ళివారు కట్నాలూ కానుకలూ అడగరు. వచ్చినవారందరికీ అయిదురోజులపాటూ భోజనాలుపెట్టి పంపితేచాలు.

శివరామయ్య తన కూతురికి ఆదర్శప్రాయమైన సంబంధం తెచ్చాననుకున్నాడు. ఎందుకనుకోడూ? ఆయనను అందరూ అభినందించారు. లక్ష్మి తల్లికూడా సంతోషించింది.

ఒక్కడే సంతోషించలేదు—కిష్టుడు.

ఇంటికి సున్నాలు కొట్టటమూ, దొడ్లో పందిళ్ళువెయ్యటమూ, అప్పడాలూ, వడియాలూ పెట్టటమూ జరుగుతూఉండగా కిష్టుడు సాహసించి లక్ష్మితో, "నువ్వీపెళ్ళికి ఒప్పుకోకే!" అన్నాడు.

కిష్టుడు లోపల చాలా బాధపడుతున్నట్టు అర్థంచేసుకుని లక్ష్మి ఆశ్చర్యపడింది. కాని ఏమి అనలేదు. తరువాత కిష్టుడు తల్లితోకూడా లక్ష్మి పెళ్లి తనకిష్టంలేదని తెలియజేశాడు. తల్లి ఈమాట తన భర్తతో చెప్పింది.

"వాడి మొహం!" అన్నాడు శివరామయ్య.

## 6

లక్ష్మి పెళ్ళి వైభవంగా జరిగింది. అంత వైభవంగా చెయ్యవలసి వస్తుందని శివరామయ్యగారు అనుకోలేదు. పది హేడుబళ్ళమీద పెళ్ళివారు డెభ్భై, ఎనభైమంది తరలివచ్చారు. "కోతిమూక, పల్లెటూరి సజ్జు" అని క్షణాలలో కీర్తి గడంచుకున్నారు. వచ్చిన ఉదయమే విడిదిలో వేపచెట్టు ధ్వంసం చేసినంత పనీ చేశారు. వచ్చినవారిలో నాలుగోవంతు పిల్లలు. వాళ్ళంతా ఎక్కడ పడితే అక్కడ దొడ్డికి కూర్చున్నారు. ఎవరూ ఎత్తేవాళ్ళు లేరు. మా పిల్లలు కారంటే మా పిల్లలు కారని. బహిర్భూమి లేదనీ పాలాలు అందుబాటులో లేవనీ పెద్దవాళ్ళగునుపు. కాఫీలూ ఉప్మాలూ ఎంత అందించినా చాలలేదు. పానకంలాగా చేసినా వాళ్ళకి పంచదార చాలలేదు. పంచదారా, వక్కపొడీ చేరల కొద్దీ మూటలు కట్టుకున్నారని చూసినవాళ్లు చెప్పారు. వాళ్ళ మోటుమాటలూ, అంతకన్న మోటు ప్రవర్తనా గమనించి విమర్శించనివాళ్ళు

లేరు. తాము పెళ్ళివారనే పొగరుకొద్దీ వాళ్ళు అన్నివిషయా లలోనూ తమకే ఎక్కువ తెలుసునన్నట్టు మాట్లాడటం శివరామయ్యగారివేపు బంధువులకు ఏవగింపు కలిగింది. వీళ్ళలో పెద్ద చదువులు చదివినవాళ్ళూ, ఉద్యోగస్తులూ, ప్లీడర్లూ ఉన్నారు. కాని ఆడపెళ్ళివారు గనక వీరిమాటలు మగపెళ్ళివారి మాటలకింద తీసికట్టయినాయి. అమగడుకీ-లక్ష్మివేపు బంధువులు నిట్టూర్చి, "ఏమయితే ఏం? వాళ్ళకింత భగవంతు డిచ్చాడు!" అని తృప్తిపడవలసిన వారయినారు.

కిష్టుడు పెళ్ళిని బాయికాటు చేశాడు. వాడు పెళ్ళి పందిరిలో కనిపించనేలేదు. "పెళ్ళికూతురి తమ్ముడు కనిపిం చడేం?" అని అందరూ అడిగేవాళ్ళే. భోజనంకూడా మూడో పంక్తి వాళ్ళతో చేసి ఎటో వెళ్ళిపొయ్యేవాడు.

పదేళ్ళ పిల్లవాడి ఆగ్రహాన్ని గురించి ఎవరు తెలుసు కుంటారు? కాని పిల్లల ఉద్రేకాలను కూడా పాటించటంవల్ల జీవితం బాగుపడుతుందేగాని చెడిపోదు. చిన్నపిల్లల విశ్వా సాలు పెద్దవాళ్ళ విశ్వాసాలంత జ్ఞానయుతంగా ఉండవుగాని అంత మూఢంగా కూడా ఉండవు......

లక్ష్మి తన భర్తను మనసా ఎటువంటి పేచీకూడా లేకుండా స్వీకరించింది. మనిషి అనాకారీకాడు, అందగాడూ కాడు. పల్లెటూరి ప్రమాణం ప్రకారం నాజూకైన వేషమే

నెత్తిన ముచ్చట ముడీ, చేతులకు మురుగులూనూ. పొట్టిగా ఉన్నా బలిష్టంగా ఉంటాడు. చాల మితభాషి, మాట్లాడితే మూడోమనిషికి వినపడకుండా మాట్లాడతాడు. ఇంగ్లీషు చదువు లేదు. పేరు నాగభూషణం.

నాగభూషణం తమ్ముడు వెంకటేశ్వర్లు. అన్నకన్న చాల ఎత్తుంటాడు బక్కల్లే సన్నగావుంటాడు తెల్లగా వుంటాడు గాని కళాహీనమైన మొహం. పెదవులు పొగచూరి ఉంటాయి. విడవకుండా చుట్టలు కాలుస్తాడు. కమతగాళ్ళ భాషే మాట్లాడుతాడు. అమిత పొగరూ, నోటి దురుసూనూ. ఇతను పష్టు ఫారం చదువుతూచాలించాడు. నాలుగైను ఇంగిలీషుమాటలు మాట్లాడతాడు. అతనితో పెళ్ళాం కాపరం చెయ్యదని ఎప్పుడూ పుట్టింటోనో ఉంటుందనీ చెప్పుకున్నారు.

గృహప్రవేశానికి వెళ్ళినప్పుడు లక్ష్మి తన అత్తవారిని గురించి ఇంకా చాలా వివరాలు తెలుసుకున్నది. నాగభూషణంగారింటికి పెద్దదిక్కు వెంకాయమ్మ. ఆవిడ నాగభూషణం కన్న ఏడెనిమిదేళ్ళు పెద్దది. విదంతువు. ఒక కొడుకున్నాడు కాని కోడలితో పడక తమ్ముడి దగ్గిరవచ్చి ఉంటున్నది. ఇంటి పెత్తనమంతా ఆవిడదే. అంతపెద్ద సంసారాన్ని ఒంటిగా ఈదుకురాగాల సమర్థురాలు. ఆవిడకి దేవుడూ, దైవమూ, పూజలూ, పునస్కారాలూ లేవు. ఒక పురాణం విందామని

గాని, హరికథ విందామనిగాని ఆవిడ కెన్నడూ లేదు. ఇల్లూ, దొడ్డీ, గొడ్డూ, గోదా, చాకిరీ, డబ్బూ—ఇవితప్ప ఆవిడ కింకేమీ అర్థంకావు, అవసరంలేదు. ఆవిడ ఎన్నడూ నవ్వే స్వభావం కలదిగా కనిపించలేదు. ఈ విషయంలో నాగభూషణానికీ ఈవిడకీ పోలిక, కాని బుద్ధుల్లో ఈ విడకీ వెంకటేశ్వర్లుకీ చాలా సామ్యం ఉంది. ప్రపంచంలో తనకు ఇష్టులే లేనట్టుగానూ, అందరిమీదా పగ ఉన్నట్టుగానూ, తప్పుచేసినవాళ్ళకి సాధ్యమైనంత అధికంగా దండన ఇచ్చేటట్టు గానూ కనుపిస్తుంది.

వెంకటేశ్వర్లు తనపెళ్లాన్ని కత్తిపెట్టి పొడిచాట్ట. ఆ సమయాన వెంకాయమ్మ అక్కడే ఉండి "అయ్యో, పాపం," అని కూడా అనలేదు. వెంకటేశ్వర్లు పెళ్లాం చావ లేదు. కాని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆవిడ కొక కొడుకు న్నాడు. వెంకటేశ్వర్లు మళ్ళీ పెళ్ళిచేసుకోక పోవడానికి కారణం ఎవరూ పిల్లనిస్తామని రాకపోవటమే. ఆ చిన్న గ్రామంలోనే వెంకటేశ్వర్లు చాలా కాపరాలు చెడగొట్ట టానికి ప్రయత్నించాడు. ఊళ్లో అతన్ని పామును చూసినట్టు చూస్తారు. అయితే వెంకటేశ్వర్లుకు ఊళ్లో బలం ఉంది. మాలవాళ్లూ, రౌడీలూ అతనికి అండ. వాళ్లకే డబ్బిస్తాడు. పెద్ద మోతుబరులలో ఒకడని ఊళ్లోవాళ్ళు అతన్ని చూసి చూడనట్టు పోనిచ్చారు.

లక్ష్మి సవతికొడుకు సత్యం చాలా చలాకీ అయిన పిల్లవాడు. వాడికి తల్లిజ్ఞాపకంలేదు. లక్ష్మిని "అమ్మా" అని పిలవసాగాడు. గంటల తరబడి దగ్గిరకూచుని కబుర్లు చెప్పే వాడు. సత్యాన్ని లక్ష్మి తక్షణం బంధు కోటిలో చేర్చు కుంది.

## 7

లక్ష్మి పెళ్ళిఅయిన పదహారో రోజే లక్ష్మి తల్లి పోయింది. పదహారురోజులపండుగ ఏడుపులతోటీ పెడబొబ్బ లతోటీ అయిపోయింది. నాగభూషణం మనుగుడుపులకువచ్చి అక్కడే ఉన్నాడు.

తల్లిచావుతో లక్ష్మి జీవితం ఒక విచిత్రమైన మార్పు చెందింది. తనకూ తండ్రికీ మధ్య సంబంధం పోయినట్టయింది. తండ్రి హృదయం నిజంగా ఎరుగదు. తన మనసులో మాట కూడా ఎన్నడూ తండ్రితోచెప్పుకోలేదు. ఈ ఇంట్లో తనకు స్థానంలేనట్టు తోచసాగింది లక్ష్మికి.

అయితే ఈ భావాన్ని కిష్టుడుపోకొట్టాడు. తలవని తలంపుగా కిష్టుడు వచ్చి తల్లిస్థానం ఆక్రమించుకున్నాడు. తల్లి పోయినరాత్రి అక్కా తమ్ముళ్ళిద్దరూ ఆరుబయట ఒకే మంచంమీద పడుకుని అర్థరాత్రి దాటినదాకా ఏమేమిటో మాట్లాడుకున్నారు. ముఖ్యంగా కిష్టుడు తన మానసిక జీవిత

మంతా అక్క ఎదుట మొదటసారి పరిచిపెట్టాడు. ఆ మానసిక జీవితం తాలూకు వివరాలు మరొకరికి ఉపకరించేవి కావు. అని వ్యర్థమైనవి కనకనే వాటిని స్వీకరించి లక్ష్మి తమ్ముడికి ఆప్తురాలయింది. ఆరోజు వాళ్ళిద్దరూ తమ హృదయాలలో తల్లి ఖాళీచేసిన జాగాలు మళ్ళీ నింపుకున్నారు. భగవంతుడి ఎదుట ఒక కొత్త ప్రేమబంధం రిజిష్టరయిపోయింది.

తన బిడ్డలిద్దరూ తనమీద విశ్వాస సాహిత్యం ప్రకటించారని శివరామయ్య ఎరగడు. అదేమిటో ఆయనకు అర్థమై ఉండేది కాదు......

తల్లిపోయిన తరువాత లక్ష్మి జీవితం మళ్ళీ యథాప్రకారమయింది ఇంటిపని యావత్తు ఆమె చేసేది. పదిగంటల కల్లా భోజనంపెట్టి తండ్రినీ తమ్ముణ్ణీ పంపించేసింది. మళ్ళీ సాయంకాలందాకా వాళ్ళు ఇంటికిరారు. ఈలోపుగా లక్ష్మికి చాలావిశ్రాంతి ఉండేది. కాలక్షేపానికి స్నేహితురాళ్ళదగ్గర పుస్తకాలు తెచ్చుకొనేది. వాళ్ళెవరైనావస్తే కబుర్లు చెప్పుకునేవాళ్ళు. ఎవరూ రాకపోతే ఇంటికి తాళం పెట్టి తనే వాళ్ళఇళ్ళకు వెళ్లేది. లక్ష్మికి సంగీతంపాడి వినిపించే స్నేహితురాలొకతె ఉండేది. గ్రామఫోను వినిపించే స్నేహితురాలొకతె ఉండేది. పుస్తకాలు అరువిచ్చే స్నేహితురాలొకతె ఉండేది.

భూమిమీదపడ్డ పదమూడేళ్ళకి లక్ష్మికి ఒక్కవిషయం చాలావిచారంగా ఉండేది—తనకు సంగీతం రాదని. కావటానికి ఆమెకు కొన్ని పాటలువచ్చు. అవిపాడినప్పుడు అంతా చాలా బాగుంది అనేవాళ్లు కాని ఇంకామంచి సంగీతం పాడాలని లక్ష్మికి కోరిక ఉండేది.

లక్ష్మికి పుస్తకాలిచ్చే సరస్వతి అన్న చక్కగా పాడేవాడు. అవి కృతులుకావు గాని అట్లా పాడటానికి చాలా జ్ఞానమూ సాధనాకావాలని లక్ష్మి ఊహించగలిగింది. ఒకసారి అతను నాటకంలో వేషంవేశాడు. ఆరోజు నరకచతుర్దశి. కొందరు స్నేహితులు చేరి నరకాసురవధ నాటకం ఆడారు. ఆ నాటకానికి సరస్వతి లక్ష్మినీ, కిష్టుణ్నికూడా పిలుచుకుపోయింది. సరస్వతి అన్న సూర్యనారాయణ కృష్ణుడి వేషం వేశాడు. ఎన్నడూ నాటకం మొహం ఎరగని లక్ష్మికి ఆ నాటకంఎంతో బాగుంది. కృష్ణుడివేషం అద్భుతంగానూ, పాట అమోఘంగానూ ఉంది. ఈ అపూర్వమైన అనుభవాన్ని లక్ష్మి ఎంతో అమూల్యంగా తనహృదయంలో దాచుకుంది.

లక్ష్మి పెద్దమనిషి అయేనాటికి అమెతల్లి పోయి ఇంకా సంవత్సరం కాలేదు. అదృష్టవశాత్తూ శాంతికాలేదు. అయితే నెలతిరగకుండానే లక్ష్మి అత్తవారు ఆమెను కాపరానికి పంపమని ఒత్తిడి చెయ్యసాగారు. శివరామయ్య గుండెల్లో రాయి

పడింది. లక్ష్మి కాపరానికి వెళ్ళితే కొంపకి ఆడదిక్కెవరు? నాలుగునెలలు గడిచాక చూద్దామని వాయిదా వేశాడు. నాలుగునెలలూ అయినాక మరో నాలుగునెలలు వాయిదా వేశాడు. లక్ష్మిఅత్తవారికి కోపంవచ్చింది. వెంకాయమ్మగారు కదలివచ్చింది.

శివరామయ్యగారికీ ఆవిడకీ గట్టిగానే ఘర్షణ జరిగింది.

కష్టాలు భరించటం అలవాటయిందేగాని లక్ష్మికి ఘర్షణలు భరించటం అలవాటుకాలేదు. వాళ్ళిద్దరూ పోట్లాడుకోవడం తన క్షేమానికి భంగమనీ, తనక్షేమంగురించి తనతండ్రి ఏమీ శ్రద్ధచూపటంలేదనీ లక్ష్మి గ్రహించింది. వెంకాయమ్మగారన్న మాటలు లక్ష్మికి అర్థం కాకపోయినా ఆమెకు భయంకలిగించినాయి.

"మావాడు మనిషా, మానా? ఎంతకాలమని ఉంటాడూ—ఉప్పూ, కారమూ తినేమనిషి? ఇంకోళ్ళయితే పెళ్ళయినమర్నాడే పిల్లను పట్టుకుపోదురు. మంచిగా ఆగినందుకిదా? చాల్చాలు!?

ఇంటి చాకిరి చేయించుకోవటానికి పిల్లను ఇంట్లో ఉంచుకున్నాడని ఆవిడ శివరామయ్య రహస్యంకనిపెట్టి పొడిచింది. చెప్పదగిన అభ్యంతరాలన్నీ చెప్పి, ఆవిడకి తెప్పించవలసిన కోపమంతా తెప్పించి ఆఖరుకి శివరామయ్యగారు

పిల్లను పైనెల్లో కాపరానికి పంపటానికి ఒప్పుకున్నాడు.

# 8

అవిభక్తకుటుంబాల అధిష్ఠాన దేవత చండశాసను రాలు. ఆవిడ తన సంరక్షణలోఉన్న వ్యక్తుల సంబంధ బాంధ వ్యాలను మునిముక్కలమీద నిలిపి ఒకరినొకరికి ఆనించి పేక ముక్కల మేడకడుతుంది. మొత్తంమీదచూస్తే ఒక నిర్మాణం కనిపిస్తుంది. కాని ఏ వ్యక్తికూడా చెయ్యీ కాలూ ఆడించటా నికి వీలులేదు. అయితే ఈ మేడలోనుంచి కొన్ని ముక్కలు నిష్క్రమిస్తాయి. మరి కొన్నివచ్చి చేరతాయి. తనుకట్టిన భవంతి కూలిపోకుండా ఉండేటందుకు అవిభక్తకుటుంబాల అధి ష్ఠాన దేవత బయటికిపొయ్యే ముక్కలను వదులుచేసి ఉంచు తుంది. కొత్తగావచ్చే ముక్కలను మిగిలినముక్కలకు ఆనీ ఆనకుండా పెడుతుంది. వాటిని ఒకంతట పునాదిలోకి రాని వ్వదు. ఈ దేవత ఎంత తెలివిగలదైనా పేకముక్కలు కూలే తీరుతాయి. పేకముక్కలు ఆవిడ చెప్పుచేతల్లో నిలవ్వు. మను షుల తెలివితేటలముందు దేవతల తెలివితేటలెంత?

లక్ష్మికి ఎన్నాళ్ళకీ అత్తవారింట సముచితస్థానం లభిం చినట్టు కనిపించలేదు. కమతగాళ్ళకున్న ప్రాముఖ్యంకూడా తన కున్నట్లు కనిపించలేదు. అయితే పల్లెటూరిజీవితంలో ప్రాము ఖ్యమనేది ఒకరిచ్చేదికాదు. కాలక్రమాన దానంతట అదే

రావాలి. అదృష్టం కలిసివచ్చి ఘనమైన పనిచేసి ఒకవ్యక్తి అకస్మాత్తుగా ప్రాముఖ్యం సంపాదించటమనేదికూడా ఉండదు. అనేకసంవత్సరాల కాలంమీద వ్యక్తి పరీక్ష జరుగుతుంది. ఆ పరీక్షకు నిలబడి వ్యక్తి తన నిజమైన శక్తిసామర్థ్యాలూ, మంచితనమూ రుజువుచేసుకోవాలి. నిన్ను ఎవరూ ఈవిధంగా ఉండమని శాసించరు. నువ్వు మంచి మనిషివైతే మంచిమనిషికింద స్వీకరిస్తారు. మిగిలిన మనుషులకు మరీవిభిన్నంగా ఉండకపోతే చాలు, నువ్వు ఎటువంటి మనిషివైనా వారి కభ్యంతరంలేదు. పల్లెటూరి జీవితంలో పిసినిగొట్టులకూ, తంపులుపెట్టేవాళ్ళకీ, దురాశాపరులకీ, వంచకులకీ, హంతకులకీకూడా స్థానముంది. కాని సంఘానికి అతీతంగా ఉండేవాళ్ళకీ, సంఘంకోసం ఆత్మత్యాగం చేసుకునేవాళ్ళకీ, సంఘాన్ని స్వార్థంకోసం బలిచేసే వాళ్ళకీ ఇక్కడస్థానంలేదు. వ్యక్తివాదం ఈ వాతావరణంలో బతకదు.

అదృష్టవశాత్తూ లక్ష్మి ప్రత్యేకతకోసం పెనగులాడే మనిషికాదు. ఆమెకు ఒకటిమాత్రం అర్థమయింది—ఈ ఇంట్లో తనకు ప్రేమబంధాలు ఏర్పడవు. కిష్టుడు ఆరోజురాత్రి తన మానసిక ప్రపంచమంతా విప్పి చూపించినట్టు ఇక్కడ ఎవరూ తనకు చూపించరు. ఇక్కడి మనుషులకు అటువంటి మానసిక ప్రపంచాలులేవు. కనీసం ఉన్నట్టు వాళ్ళెరగరు. తను తన

మొగుడితోకూడా అందరూ చూస్తుండగా మాట్లాడరాదు. రాత్రిఅంతా పక్కలు చేరేవరకూ తన మొగుడుండగా తమ తమ పడకగదిలోకి వెళ్ళటానికికూడా వీలులేదు. తనకు ఇతరులమీదకంటె భర్తమీద ఎక్కువ అభిమానం ఉండవచ్చు గాని ఆ అభిమానాన్ని అందరిఎదటా ప్రదర్శించరాదు. నాగభూషణమైనా అంతే. ఈ చిన్నభార్య రావటంవల్ల తన దైనిక జీవితంలో ఎటువంటిమార్పు తెచ్చిపెట్టుకోవటానికి లేదు. అంతా ఎప్పటిలాగే ఉండాలి; ఉన్నదికూడానూ.

ఏ బస్తీవాళ్ళుగాని లక్ష్మికేసి చూసి "ఈ పిల్ల బస్తీ పిల్ల," అని చెప్పలేరు. కాని ఆమెలో ఎక్కడో బస్తీ లక్షణాలుండిఉండాలి. ఈ పల్లెటూరు రావడం ఆమె కెట్లాఉందంటే, చలీ, ఉక్కా, ఆకలీ దప్పీ లేని చోటికి వచ్చినట్టుంది.

అందరమూ కాలాన్ని కొలుస్తాం. ఎవరి కొలతవస్తువులు వారికిఉంటాయి. పట్టణవాసులు పల్లెటూరువెళ్ళి ఒక రోజుగడిపితే కాలం జరగకుండానే రోజు అయిపోయినట్టుంది. తన తండ్రికీ, కిష్టుడికీ, అన్నంపెట్టి బయటికిపంపటమూ, పుస్తకాలు చదవటమూ, పాడుకోవటమూ, రాత్రి వంటింట్లో కూర్చుని కిష్టుడు మధ్యమధ్య తనకు సహాయంచేస్తూ కబుర్లు చెప్పటమూ–ఇవేవీ జరక్కుండానే తెల్లవారటమూ, పొద్దూకటమూ లక్ష్మికి చాలారోజులపాటు వింతగాతోచింది.

వీటికేంగాని, నిజంగా లక్ష్మిని బాధిస్తూవచ్చిన అంశాలు వేరేఉన్నాయి. బస్తీపిల్లకావటంవల్ల లక్ష్మికి కొంత అస్పృశ్యత అంటుకుంది. తన భర్త నూరెకరాల మోతుబరి కాకపోవటమూ, తన తల్లి చచ్చిపోవటమూకూడా తనకు పెద్ద లోపాలయినాయి.

"నాకీ బస్తీ సంబంధం ఎంతమాత్రం ఇష్టంలేదు. మన ఎత్తుకు తగ్గట్టు వాళ్ళు మనల్ని చూడలేరు. పెళ్ళి అయిదు రోజులూ ఇంత తిండిపెట్టటానికే కిందూ మీదూ అయినారు... ఎవర్ని ఎట్లాచూడాలోకూడా వాళ్ళకి తెలీదు. లక్ష్మికి ఒక్క పని చాతకాదు. ఎట్లా చాతవుతుందీ? ఎన్నడన్నా చేసిందా, పెట్టిందా? జానెడుబెత్తెడుదొడ్డి ఊడవటమూ, ముగ్గురికి అన్నం వండటమూ వాళ్ళకి ఘనం. మాట మాట్లాడితే ఆ శివరామయ్యగారు, మా పిల్ల కన్నిపనులూ వచ్చునంటాడు, అడగక్కల్లా!......ముద్దా, ముచ్చటా? ఆ తల్లికూడా చచ్చింది. మహా తల్లిది ఎటువంటి జాతకమోగాని పెళ్ళయిన పదహారోరోజు కల్లా తల్లిచచ్చింది. ఇక్కడ అడుగుపెట్టిన నెలకల్లా నిక్షేపమంటి దూడచచ్చింది" అనేది వెంకాయమ్మ.

మొదట్లో లక్ష్మి తన ఆడబడుచు అనేమాటలు, ఆశ్చర్యంతో వినేది. ఆమాటలు తననే అంటున్నదని నమ్మలేకపొయ్యేది. వెంకాయమ్మకు నిజంగా తనమీద కోపంరావటానికి

కారణంఏమిటీ? ఏమీలేదు. అయితే లేనికోపం ఎందుకు నటిస్తున్నదీ? తెలీదు.

"ఆవిడ స్వభావం అంతేగామాలు!" అనుకున్నది లక్ష్మి.

వెంకాయమ్మ రోజుకు పదిహేనుసార్లు సందర్భశుద్ధి లేకుండా, "ఆ చిన్నవాడి కాపరం అట్లా చితికిపోయిందిగదా!" అనుకునేది. వెంకటేశ్వర్లు కాపరం చితికిపోవటానికికూడా తనే కారణమని ఆవిడ అభిప్రాయమేమోనని లక్ష్మి సంశయించేది. నిజమేమిటంటే వెంకటేశ్వర్లుకు తిరిగి సంబంధం రాకపోవటం వెంకాయమ్మకి స్వయంగా పెద్ద అవమానమయింది. నాగభూషణంగారు ఒకనాడు ఇంటికొచ్చి, "నేను మళ్ళీ సంబంధంచూస్తున్నాను." అన్నప్పుడు వెంకాయమ్మ ఆత్రంగా, "వాడికో?" అన్నది. "వాడి పెళ్లి వాణ్ణిచేసుకోనీ, నా కర్తవ్యంతరంలేదు." అన్నాడు నాగభూషణం.

లక్ష్మి ఇంటో తిరుగుతూంటే వెంకాయమ్మకు చిన్న తమ్ముణ్ణిగురించి విచారం రెట్టింపయింది. లక్ష్మినిగురించి నోటితీట తీర్చుకోవటంవల్ల ఈ విచారం ఉపశమిస్తుందని వెంకాయమ్మ ఆశ అయిఉండవచ్చు. కాని క్రియకు జరిగిందేమిటంటే నానాటికీ లక్ష్మిమీది ద్వేషంతోపాటు ఈ విచారంకూడా పెరగసాగింది.

# 9

నాగభూషణంవంటి మనిషిని లక్ష్మి ఎన్నడూ చూడ లేదు. ఆయన మనస్సులో చాలా ఆలోచనలున్నట్టుంటాయి గాని ఒకటి పైకిచెప్పడు. తనమీద ఆయనకు అభిమానంఉన్నట్టు లక్ష్మికి రూఢిగా తెలుసు. కాని తనకు కొంచెమైనా చనువివ్వడు. తన మనసులోమాట పైకి అనుకునేటందుకుకూడా ప్రోత్సాహం ఇవ్వడు.

వెంకాయమ్మ తనను అంత నీచంగా ఎందుకు చూస్తుందో భర్తనడిగి తెలుసుకుందామని లక్ష్మి చాలా సార్లు అనుకుంది. కాని ఎన్నోసార్లు ఆ ప్రయత్నం మానేసింది. ఆఖరుకు ఒకసారి తెగించి ఆవిషయం ఎత్తింది. ఆమెమాట ఇంకా ఆమెనోట ఉండగానే నాగభూషణం, "మా అక్కను గురించి నాతో ఏమీచెప్పకు. ఆవిడ ఏదన్నాఅంటే నువు పడ దగ్గదానివే. ఇంతలో నీకేమీ నష్టంరాదు." అన్నాడు. ఆయన గొంతెత్తి అరవలేదు. కాని ఎంతో గట్టిగా చివాట్లుపెట్టినట్టు తోచింది లక్ష్మికి. సత్యంమీద లక్ష్మి అపేక్షగా ఉండటం గురించికూడా వెంకాయమ్మ సూటిపోటి మాటలన్నది. "చిత్రాంగివేషాలు" అనికూడా ఒకమాట వదిలింది. ఐతే లక్ష్మికి చిత్రాంగి ఎవరోతెలీదు. కాని లక్ష్మి సత్యాన్ని ముద్దుచెయ్యటం మానలేదు.

సత్యం గుడ్డలు తెగమూపుకుంటూన్నూ, అన్నం తినేట ప్పుడు కంచంచుట్టూతా కళ్ళంచేస్తాడు. ఈరెండు దురలవాట్లు మానిపించటానికి లక్ష్మి ప్రయత్నంచేసింది. ఈ విషయంలో వాణ్ణి మార్చటానికి అదివరకెవరూ ప్రయత్నించిఉండలేదు. లక్ష్మిచేసేప్రయత్నం కొనసాగుతుందని వెంకాయమ్మ అను కోలేదు. ఒకనాడు సాయంకాలం సత్యం ఇంటికి తిరిగివచ్చి, "అమ్మా లాగుకు కొంచెం మట్టిమరకయింది." అని చెబుతు న్నాడు. "పోనీలే, నేను పోగొడతాలే," అంటున్నది లక్ష్మి, మొహం కండలు ఊడబెరుక్కుంటూ వెంకాయమ్మ ముందు కొచ్చి, "మేమేం ఉద్యోగస్తులం కాం. పొలంపని చేసుకునేవా ళ్ళకి చలవబట్టలు దేనికి" అంటూ సత్యాన్ని రెక్కపట్టుకు లాక్కుపోయింది.

తరవాత మరో గంటసేపయినాక సత్యం కంచంముందు కూచున్నాడు. లక్ష్మి వడ్డిస్తున్నది. లక్ష్మినీ సత్యాన్నీ ఏకాం తంగా రెండునిమిషాలుకూడా వదలటం ఇష్టంలేని వెంకాయమ్మ అటువచ్చి, సత్యంకిందపడ్డ చిన్న కరుడొకటిఏరి కంచంలోపెట్టు కోవటం చూచింది. "ఏ జన్మానా కడుపునిండా తిండితిని ఎరగని దరిద్రగొట్టల్లే కిందపడ్డ మెతుకులదగ్గిర్నుంచీ ఏరుకుతింటాడేం? నువు దగ్గిరేఉంటివిగా? ఏం చేస్తున్నావు?" అన్నది వెంకాయమ్మ కొంద్రంగా.

వెంకాయమ్మ ధోరణి ఇట్లాఉంటే వెంకటేశ్వర్లుధోరణి మరొకరకం. అతను లక్ష్మితో సంభాషణారూపంలో ఒక్క ముక్క మాట్లాడలేదు. ఆమెను చూచినప్పుడల్లా మొహం మటమటలాడించుకునేవాడు. ఆమె చూపుమేరదూరంలోఉం దంటే ఏపనిచేసినా పరుషంగా చేసేవాడు. నడిస్తే పాదాలు పెద్ద చప్పుడుతో నేలతాటిస్తూ నడిచేవాడు. తాడు పురివే స్తూంటే పళ్లు బిగబట్టి బలమంతా వినియోగించి లేని రెట్టలు కూడా వెళ్లుకొచ్చేట్టు పురివేసేవాడు. ఆఖరుకు దణ్ణెంమీద పంచలాగినా దణ్ణెం తెగినంతపనిగా లాగేవాడు. కమతగాళ్ళతో మాట్లాడితే వాళ్ళను కొట్టబొయ్యేట్టు మాట్లాడేవాడు. గొడ్ల నయితే చచ్చేట్టు బాదేవాడు. ఇటువంటి ప్రవర్తన లక్ష్మికెట్లా కనిపిస్తున్నదో గ్రహించే తెలివితేటలు వాడికిలేవు.

లక్ష్మి కాపరానికి వచ్చిన కొత్తలో ఊళ్లోవాళ్ళంతా వచ్చి చూచిపోయినారు. అయితే వాళ్లెవరితోనూ లక్ష్మికి నిజమైన పరిచయంకాలేదు. ... కూడా తనను ఎడంగా ఉంచు తున్నట్టే ఉండేది. ఇద్దరంటే ఇద్దరే లక్ష్మితో ఆప్యాయంగా చాలాసేపు మాట్లాడారు.

ఒకతె నరసమ్మ, చేతిలో గిన్నెపట్టుకువచ్చింది. దొడ్లో నుంచి నట్టింటోకి తొంగిచూసి, "నాగభూషణం పెళ్లానివా, అమ్మా? పోన్లే, పాపం!" అన్నది తలఆడిస్తూ.

లక్ష్మి మర్యాదకోసం దొడ్డివాకిలిదగ్గిరకొచ్చి నిలబడింది.

"వెంకాయమ్మొదినె లేదూ?" అన్నది నరసమ్మ.

"పాలుతియ్యటానికి వెళ్ళారు," అన్నది లక్ష్మి.

"అల్లుడొచ్చాడూ, గిన్నెడు నెయ్యి బదులిస్తారేమోనసీ!" అని తను వచ్చినపని చెప్పింది నరసమ్మ.

"ఆవిడ రాగానే–"

"అట్టానే లే!" గొంతుతగ్గించి, "నువ్వుమటుకు జాగ్రత్తగా మసులుకో, తల్లీ.....వాట్టి పాపిష్టిముండ!...ఆ వెంకటేశ్వర్లు గొంతు నిలువునా కొయ్యలా? ఎందుకడుగుతావులే! వాడి పాడెగట్టా, వాడెటువంటివాడు? నల్లకుక్కను దాటిపోనివ్వడు..."

నరసమ్మ రహస్యంగా ఇటువంటి కబుర్లు చెబుతుంటే ఏమనాలోకూడా లక్ష్మికి తెలియలేదు. తన మరిది ఊళ్ళోకా పరాలకు చిచ్చుపెట్టాడనీ, వ్యభిచారిఅనీ తెలియటం ఆమెకు అదేమొదలు. అదృష్టవశాత్తూ వెంకాయమ్మ తిరిగి రావటంతో ఈ సంభాషణ అంతమయింది.

"ఊరపొద్దోకుతుంటే లాంతర్లు తుడిచి కిరసనాయిలు పోసుకోరూ? కబుర్లకు వేళాపాళా లేదూ?" అన్నది వెంకాయమ్మ.

లక్ష్మి చప్పున చావిడిలోకి వెళ్ళిపోయింది.

"ఏంలేదు వదినా! అల్లుడొచ్చాడూ!..."అన్న నరసమ్మ మాటలుమటుకు లక్ష్మికి వినిపించినాయి.

"మా ఆడబిడ్డనడిగి నెయ్యి పట్టుకుపోలేకపోయినావా, నరసమ్మా?" అన్నది వెంకాయమ్మ.

"అయ్యో తల్లి, నాకిచ్చిందా? నన్ను నమ్మిందా? నువు రావాలన్నది. మీ తమ్ముడికాపరం నిలువునా నువేతీశావట. మధ్య నువ్వేంచేస్తావూ?" అన్నది నరసమ్మ.

తొక్కతొక్కిన తాచల్లే వెంకాయమ్మ సావిట్లోకి వచ్చేసరికి ముగ్గుతో లాంతరు చిమ్నీలు తుడుస్తున్నది లక్ష్మి.

మనుషులా, గొడ్లా? నోటికివచ్చిందల్లా పేలటమేనా?... అవును, నేను కాపరాలుతీసేదాన్నే! నన్ను దేముడట్లా పుట్టించాడు-"అని కప్పు ఎగిరిపొయ్యేటట్టు కేకలుపెట్టసాగింది.

"ఆ మనిషిమాట లెందుకు పట్టించుకుంటూరు, వొదినా? ఒకొక్కరికి నోళ్ళు అటువంటివీ! ఆ నరసమ్మ ఎవరినిగురించీ మంచిమాట చెప్పుకోలేదు," అన్నది.

తను ఆడదలుచుకున్న నాటకానికి ఇంకా నాందికూడా పూర్తిచెయ్యని వెంకాయమ్మ ఈ మాటకు ఖిన్నాంతపోయింది. నరసమ్మ తలపులమారిదని అదివరకే తెలిసిఉండటంవల్ల జరిగినదేమిటో గ్రహించి చరచరా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

లక్ష్మితో మనసిచ్చి మాట్లాడిన మరోమనిషి కామమ్మ.

"మీ మరిదిగారు మాయింటికి చిచ్చుపెడుతున్నారు. తల్లీ, ఏం చెప్పుకోను? కడుపుచించుకుంటే కాళ్ళమీదపడు తుంది, ఒక్క కూతురు నాకు. కన్నవారు నాకిచ్చిన రెండెక రాలూ దానికిచ్చి పెళ్ళిచేశా. దానిబతుకు బుడలుచేస్తున్నాడు. ఊరంతాపాక్కింది. దాని మొగుడికి తెలిస్తే నాకు బతికినన్నా ళ్ళూ రొమ్ములకుంపటే!" అని ఏడిచింది కామమ్మ.

కామమ్మ చెప్పినవిషయం ఆరాత్రి లక్ష్మి మొగుడితో చెప్పటానికి ప్రయత్నించింది. కాని నాగభూషణం మండిపడ్డాడు.

"వాడివిషయం నేనే పట్టించుకోను. నీకెందుకు? ఊళ్లో వాళ్ళనీ వాణ్ణీ తేల్చుకోనీ!" అన్నాడు. లక్ష్మి వాణికిపోయిం ది. ఏకారణంచేతో లక్ష్మికి వెంకాయమ్మను చూసినా, వెంక టేశ్వర్లును చూసినా లేనిభయం మొగుణ్ణిచూస్తే. అయితే ఈ భయంవెంట గౌరవంకూడా ఉంది.

## 10

ఊళ్ళోవాళ్ళు లక్ష్మినిగురించి ఏమనుకున్నారు? మొద ట్లో వాళ్లు ఆమెనుగురించి మంచిఆశించలేదు. బస్తీపిల్ల, రెండో పెళ్ళాం, సవితితల్లి ఈ మూడురీతులా ఆమె ప్రవర్తన సరిగా ఉండదనుకున్నారు. బస్తీపిల్లగనక లేనిపోని దర్జాలు చలాయి స్తుందనుకున్నారు; వెంకటేశ్వర్లు వంటివాడు దగ్గిరేఉన్నాడు

కూడానూ. సత్యాన్ని కాల్చుకుతింటుందనుకున్నారు. ఇవన్నీ అంచనాతప్పటం ఊళ్లోవాళ్ళకి లక్ష్మిమీద చాలా గౌరవం కలిగింది.

వెంకాయమ్మ ఎటువంటిదో వాళ్ళకి తెలియకపోలేదు. ఆవిడ లక్ష్మిని రాచి రంపానపెట్టటానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నదని వాళ్ళకు తెలుసు. నాగభూషణం మొదటిపెళ్లాం విషయంలోకూడా వెంకాయమ్మ కొంత జయించింది. అక్క గారి మాటలువిని నాగభూషణం ఎప్పుడైనా పెళ్ళాన్ని కొట్టే వాడు. ఈసారి అటువంటిదేదీలేదు. ఆ గొప్పతనం లక్ష్మి దేనని చాలామంది అనుకున్నారు. కొద్దిమందిమటుకు నాగభూషణం తన చిన్నపెళ్లాంవిషయంలో కాస్త తీపిగాఉండటంవల్ల వెంకా యమ్మ జయించలేకుండాఉందని అభిప్రాయపడ్డారు.

అయితే అందరికీ లక్ష్మివిషయంలో ఒక ఆగ్రహంమటు కుంది. కాపరానికివచ్చి నాలుగేళ్ళయింది. ఇంతవరకూ ఒక్క నలుసులేదు. లక్ష్మి గొడ్రాలనే ఏవగింపు ఊరంతకీకలిగింది. వెంకాయమ్మవిషయం చెప్పనేఅవసరంలేదు. ఆవిడ కిప్పుడు రోజూ అదేస్మరణ. అంతకంటె లక్ష్మినిసాధించటానికి వీలుగా మరేదీ దొరకటంలేదు.

కొంతకాలంకిందివరకూ లక్ష్మికి పుట్టింటినిగురించిన విచారంవుండేది. ఇంటో ఆపదిక్కు లేదు. శివరామయ్యగారే

చెయ్యికాల్చుకోవటం. మిగతా చాకిరికి పనిమనిషిని పెట్టుకున్నారు. లక్ష్మిని చూడటానికి తండ్రి ఎప్పుడైనా వస్తుండేవాడు. కిష్టుడుమాత్రం రానేలేదు. ఇటీవల కిష్టుడు కాలేజీలో ప్రవేశించాడు. శివరామయ్యగారి మరదలికొడుకు ప్రాక్టీసు పెట్టి, పల్లెటూళ్ళోఉన్న సొంతఇల్లు ఖాళీచేసి శివరామయ్యగారింటికి కుటుంబాన్ని తెచ్చాడు. శివరామయ్యగారు అద్దెపుచ్చుకోనన్నాడు. వాళ్లే ఆయనకుకూడా కాచిపోస్తున్నారు. అందుచేత లక్ష్మికి తండ్రినిగురించిన విచారమూ, తమ్ముణ్ణి గురించిన విచారమూ తగ్గింది.

కాని అంతకంటె పెద్దవిచారం మరొకటి పట్టుకుంది. వెంకటేశ్వర్లు తనవెంట పడసాగాడు. మొదట్లో లక్ష్మి అర్థం చేసుకోలేకపోయింది, ఇప్పుడు పాలుపితకటం లక్ష్మివంతయింది. ఆమె దొడ్డికివెళ్ళినప్పుడు అక్కడ వెంకటేశ్వర్లు తయారూ. లక్ష్మివినేటట్టు గొడ్ల మీదపెట్టి అసహ్యంగా మాట్లాడతాడు కమతగాళ్ళతో.

"మచ్చలావు గొడ్డుమోద్దిరా. దానికి తగ్గ ఎద్దు దొరకలా!" ఈధోరణిలో వెంకటేశ్వర్లు లక్ష్మితో చాటు సరసాలారంభించాడు. లక్ష్మి మొదట్లో వినిపించుకోలేదు. అర్థంచేసుకోలేదు. అర్థం చేసుకున్నాక వెంకటేశ్వర్లుమీద చెప్పరాని అసహ్యం వేసింది. ఎవరూ లేనప్పుడు వెంకటేశ్వర్లు ఎగాదిగా పరీక్ష చేసేవాడు "ఎమిటట్లా చూస్తావు? తినేస్తావా?" అని

అడగాలనుకునేది లక్ష్మి. కాని నోటిమాటవచ్చేదికాదు. నాలుగేళ్లనుంచీ పల్లెటూరికాపరం చేస్తున్నా పల్లెటూరివాళ్ళకుండే సహజమైన మనోదార్ఢ్యం లక్ష్మికి రాలేదు. మనస్సు కేపాటి కష్టం కలిగినా జావ అయిపోతుంది గాని గట్టిబడి ఆత్మరక్షణ చేసుకోలేదు.

ఒకరోజు సాయంకాలం లక్ష్మి కాస్త పొద్దుగూకి పాలు పితకటానికి వచ్చింది. దొడ్లో వెంకటేశ్వర్లున్నాడు. పాకలో నులక మంచంమీద చీకట్లో కూర్చున్నాడు. చుట్ట కొండి మాత్రం మిణుకుతున్నది.

లక్ష్మి గొడ్ల పాలుపితికి వెళ్ళిపొయ్యే సమయానికి చీకటి పడ్డది.

"మాట," అన్నాడు వెంకటేశ్వర్లు. లక్ష్మి విన్నది గాని తన ననుకోలేదు.

"నిన్నే నమ్మోవ్?" అన్నాడు మళ్ళీ.

"ఆఁ?" అన్నది లక్ష్మి ఉలికిపడి.

"మాట."

"ఏంమాట?"

"చెబుతా, రా."

"చెప్పరాదూ?" లక్ష్మికి తనగొంతు తనకే అసహ్యంగా తోచింది.

"రేపు తోలుబొమ్మ లాడిస్తున్నాం."

లక్ష్మి మాట్లాడలేదు.

"జుట్టు పోలిగాడూ, కేతిగాడూ, బంగారకాక-గొప్ప షార్సు."

లక్ష్మి మాట్లాడలేదు. వెళ్ళిపోవటానికి తిరిగింది. ఒక్క-చెంగున వెంకటేశ్వర్లు బయటికొచ్చి లక్ష్మి చెయ్యిపట్టు కున్నాడు-ఎడమచెయ్యి.

"మర్యాదగా పలకరిస్తుంటే దులుపుకు పోతావేం? పతిత్రతవు. డబ్బుకోసం ముసలాణ్ణి చేసుకుని-సిగ్గులా?" అన్నాడు పళ్ళు బిగబట్టి.

లక్ష్మి నిలువునా వొణికిపోయింది. కళ్ళనీరు తిరిగింది. ఏవరో వస్తున్న అలికిడి అయింది. వెంకటేశ్వర్లు చెయ్యివొదలి పెట్టాడు. లక్ష్మి గబగబానడుస్తూ తూలుతూ వెళ్ళిపోయింది. ఆమె మొహం చూచిన వాళ్ళెవరైనా ఆక్షణాన "ఏం జరిగింది?" అని అడిగివుండును. కాని ఇంటికొచ్చినాక వెంకాయమ్మ—ఆవలిస్తే పేగులు లెక్క-పెట్టగలది—ఏమీ మాట్లాడలేదు.

లక్ష్మి ఆరోజుకు ఏమీ సరిగా చెయ్యలేక పోయింది. జరిగిన అపచారం నరనర్నా కాల్చేస్తున్నది. రెండు గంటలు గడిచినాకకూడా ఈపని అప్పుడే జరిగినట్లుంది. అన్నం సయించలేదు. కిష్టుడితో కూడా సరిగా మాట్లాడలేకపోయింది.

ఆరాత్రి పడకగదిలో నాగభూషణంమటుకు, "ఏం,

అట్లా ఉన్నావు?" అన్నాడు. తల నొప్పిగా ఉందన్నది లక్ష్మి.
"శాంతిగంధం వేసుకోలేకపోయినావా?" అని నాగభూషణం ఏమీ జరగనట్టు పడుకుని నిద్రపోయినాడు.

# 11

తరవాత రెండురోజులకి తోలు బొమ్మలాట జరిగింది. కిష్టుడు రోజల్లా గంతులేస్తూనేఉన్నాడు. సాయంకాలం తెరలు కట్టేచోటఉండి, అంతాచూసి అన్నంతినటానికి ఇంటికి పరిగెత్తు కొచ్చాడు.

వెంకాయమ్మకు తోలుబొమ్మలమీద ఆసక్తిలేదు. నాగభూషణం కాస్సేపు కూర్చునివస్తానని వెళ్ళాడు. మరి కొంతమంది స్త్రీ జనంతోకలసి లక్ష్మికూడా వెళ్ళింది. తెల్ల వార్లూ చూస్తానని ప్రజ్ఞపట్టి సత్యంవచ్చాడు వాడు లక్ష్మికి దగ్గిరిగానే కూచున్నాడు.

ఆ అలగాజనంమధ్య కూర్చుని తోలుబొమ్మలు చూస్తుం టే లక్ష్మికి మళ్ళీ ఒక్కసారి నరకాసురవధ నాటకం చూడా లనిపించింది. ఈ పల్లెటూరి జీవితమూ, తన భర్తా, వెంకాయ మ్మా, వెంకటేశ్వర్లూ—ఇదంతా కలగా అనిపించింది. ఈ నిద్ర మేలుకుని తను వెనకటిలాగా పుస్తకాలు చదువుకుందామనీ, పాటలు పాడుకుందామనీ అనిపించింది. తనవారకూడా సత్యం తోలుబొమ్మల కానందిస్తున్నాడు.

కొంతసేపటికి కేతిగాడూ, బంగారక్కా తెరమీదికి

వచ్చారు. జనంలో నూతనోత్సాహం బయల్దేరింది. లక్ష్మి అప్రయత్నంగా జనాన్ని కలయచూసింది. వెంకటేశ్వర్లు కనిపించాడు—తననే చూస్తున్నాడు.

"సత్యం నేనింటికిపోతున్నాను. నువుకూడా రా. నాకు నిద్దరొస్తున్నది," అన్నది లక్ష్మి.

సత్యం తెరకేసి దీనంగాచూస్తూ, "ఇప్పుడా!" అన్నాడు.

"అయితే నువ్వుకూర్చో. నేను పోతాను" అని లక్ష్మి లేచింది.

"కాస్సేపుంటే నేనుకూడా వస్తాగా?" అన్నాడు సత్యం.

"నేనుండను. నువ్వు నీ యిష్టంవచ్చినప్పుడు రా," అంటూ జనంలోనుంచి బయటికి రాసాగింది. నాగభూషణం ఎక్కడా కనిపించలేదు. ఇంటికి వెళ్ళిఉండాలి.

ఇల్లు అట్టేదూరంలేదు. మలుపుతిరిగితే పశువులదొడ్డి, దొడ్డినానుకుని ఇల్లూ. లక్ష్మి దొడ్డిని సమీపిస్తుండగా వెనక అడుగుల చప్పుడు వినిపించింది. లక్ష్మి వెనక్కుతిరిగి చూస్సే లోపలనే ఆమెకు అనుమానంపోయింది—ఆవచ్చేది వెంకటేశ్వర్లేను.

"కాస్త ఆగండి వదినెగారూ!"

లక్ష్మి మరింతవేగం నడకపుచ్చుకుంది. వెంకటేశ్వర్లు చేరవగా లక్ష్మిని వెనకనుంచి వాటేసుకుని, "ఏమిటా పొగరూ?" అన్నాడు.

లక్ష్మి అతన్ని ఒక్క విదిలింపు విదిలించింది. వెంకటే శ్వర్లు కిందపడ్డంత పనిఅయిందిగాని అతను పట్టువదల్లేదు.

"నాదగ్గిరవెయ్యేమాకు నీ పతివ్రతవేషాలు, ఇష్టంలేనిదా న్నైతే నిన్ననే నీ మొగుడికి చెప్పకపోయినావా? ఎందుకు చెడతావు, రా. ఎవ్వరూచూడరు. పదినిమిషాలలో ముంచు కుపొయ్యేదేమీలేదు. చెప్పినమాటవిను," అన్నాడు వెంకటే శ్వర్లు.

లక్ష్మి గొంతెత్తి "ఛీ, వొదులు! మా అన్నయ్యతో చెబితే చంపేస్తారు. నీకు బుద్ధిలేదా? వొదులు, వొదులు!" అని అరవసాగింది.

ఎందుకట్లా గొంతు చించుకుంటావు? ఏమిటి నీఉద్దేశం?" అన్నాడు వెంకటేశ్వర్లు. తనకోసం లక్ష్మి తపించటంలేదని వాడితలకెక్కలేదు.

"అమ్మా!" సత్యం గొంతు.

"సత్యం!" అని పెద్దపెట్టున కేకపెట్టింది లక్ష్మి.

లక్ష్మి వెళ్ళిపోగానే సత్యానికి తోలుబొమ్మలాట బాగుండటం మానేసింది. నాలుగైదునిమిషాలు బలవంతాన దాన్ని భరించి ఇక ఉండలేక లేచాడు. మలుపుతిరుగుతుండగానే సత్యానికి మనుష్యుల అలికిడి వినపడింది. మలుపుతిరిగినాక లక్ష్మి గొంతుకూడా వినిపించింది. సత్యానికేమీ అర్థంకాలేదు. రెం డోమనిషి తన బాబాయని సత్యం కనుకున్నాడు. కాని ఏమి

జరుగుతున్నదీ, లక్ష్మి ఎందుకు బాబాయిని తిడుతున్నదీ వాడి కర్థంకాలేదు.

వాడి గొంతు వినిపించేవరకూ సత్యం వచ్చినసంగతి ఆ ఇద్దరికీ తెలీదు. లక్ష్మి "సత్యం!"అని కేకపెట్టినమరుక్షణం వెంక టేశ్వర్లు పశువుల దొడ్లోకి దూరాడు.

"బాబాయి ఏంచేస్తున్నాడు?"

"నన్ను దొడ్లోకి రమ్మంటున్నాడు"

"ఎందుకూ?"

"పాగ రెక్కి..."

ఇద్దరూ మరి మాట్లాడకుండా ఇంటికివచ్చారు.

పడకగదిలో నాగభూషణాన్ని చూడగానే లక్ష్మి పెద్ద పెట్టున ఏడిచేసింది.

"ఏం? ఏంవచ్చింది?" అన్నాడు నాగభూషణం, ఆమె దుఃఖకారణంతో సానుభూతిలేనివాడల్లే.

"నా కాపరాన్నికూడా చిచ్చుపెట్టాలనిచూస్తున్నాడు. ఆమనిషికి ఎవరిభయమూలేదు. తెగబడ్డాడు," అన్నది లక్ష్మి ఏడుస్తూనే.

"సత్యం వెంటరాలా?" అని అడిగాడు నాగభూషణం.

"రానన్నాడు. సమయానికి దేవుడల్లేవచ్చాడు, ఏ బుద్ధినున్నాడో," అన్నది లక్ష్మి.

నాగభూషణం సత్యాన్ని గదిలోకి పిలిచాడు. సత్యం

తను చూసిందంతా చెప్పాడు.

నాగభూషణం ఒక్కక్షణం మౌనంగాఉండి చివాలున లేచాడు. హాలులో గోడకానించివున్న దుడ్డుకర్రతీసుకున్నాడు. బయటికివెళ్ళాడు.

హాలులోని పడుకునివున్న వెంకాయమ్మ మంచంలో లేచి కూర్చుని, "ఎక్కడికిరా? ఏం జరిగిందిరా?" అని కేకేసింది. కాని నాగభూషణం సమాధానంచెప్పకుండా వెళ్ళిపోయినాడు.

వెంకాయమ్మ గొంతు మరికాస్త పన్నంసాగించింది.

"ఎక్కడి మహామారి దాపరించిందిరా, దేవుడా! ఇవాళతో వాడికి భూమ్మీద రుణంతీరిందే! ఈ పెళ్ళివద్దని నెత్తీ నోరూ బాదుకున్నానే! ఏరి ఏరి చితాగ్నిని కట్టుకున్నాడే! రామలక్ష్మణులంటి అన్నదమ్ములమధ్య చిచ్చుపెట్టిందే! ఇవాళ తెల్లవారి ఎవరిమొహంచూశానో......

లక్ష్మికి మొట్టమొదటిసారి వెంకాయమ్మమీద పట్టరాని ఆగ్రహం—క్షుద్రుడైన బలహీనుడిమీద బలవంతుడైన ధర్మాత్ముడికికలిగే ఆగ్రహం-పుట్టుకొచ్చింది. వెంకాయమ్మ రెండుచెంపలూ ఫెడీ ఫెడీ వాయించుదామనిపించింది. అదివరకల్లా వెంకాయమ్మలో ఎంత విషంఉన్నా బలం ఏదో ఉన్నట్టుండేది. ఇప్పుడే కొత్తగా లక్ష్మి వెంకాయమ్మలో దుర్జనత్వంతోపాటు అశక్తతకూడా చూడగలిగింది.

పది నిమిషాల్లో నాగభూషణం తిరిగివచ్చాడు.

"వాణ్ణి చంపి వచ్చావురా? నీపగ తీరిందిరా? ఆ చిత్రాంగిమాటలు విన్నావురా? ఏంచేశావురా? మాట్లాడ వేంరా?" అని వెంకాయమ్మ తగులుకున్నది. నాగభూషణం పెద్ద చప్పుడుతో దుడ్డుకర్ర విసిరి గోడదగ్గిర పారేసి చెప్పులు విడిచి గదిలోకివచ్చి మాటాపలుకూ లేకుండా పక్కమీద పడుకున్నాడు.

# 12

మర్నాడు ఉదయానికల్లా వెంకటేశ్వర్లు ఊళ్లో లేడు. ఎక్కడికి వెళ్ళాడో ఎవరికీ తెలియదు. లక్ష్మిమీద ఊళ్లో సదభిప్రాయం పెరుగుతున్న ఈ సమయంలో వెంకాయమ్మ ఆమె మీద విషప్రచారం చెయ్యటానికి వెంకటేశ్వర్లు నిష్క్రమణ బాగా ఉపయోగించింది. వెంకటేశ్వర్లుసంగతి తెలిసినవాళ్లు కూడా లక్ష్మివల్ల అంతో ఇంతో లోపం ఉందనుకోకుండా ఉండలేకపోయినారు. ఏ మనిషిగానీ పూర్తిగా నిర్దోషిఅనుకోవటం పల్లెటూరివాళ్ళకు చాతకాదు. ఏపుట్టలో ఏపాముందో అనే సిద్ధాంతం వాళ్ళకు బాగా నచ్చుతుంది. బాగా దెబ్బతిని, చితికిపోయి, పూర్తిగా అనాధలైనవాళ్ళలోమాత్రమే వాళ్ళకి పరిపూర్ణమైన మంచితనం కన్పిస్తుంది. అటువంటివాళ్లలో ఉండే లోపాలన్ని క్షమించి వాళ్ళలో సమగ్రమైన మంచితనం చూడగలుగుతారు.

వెంకటేశ్వర్లు పరార్అయినాక లక్ష్మి పరిస్థితి చాలా

ల్లు బాగుపడింది. బయట ఏంచేసినా ఇంటో వెంకాయమ్మ లక్ష్మిని వెనకటికన్న గౌరవంగా చూడసాగింది. ఆ లోగిట్లో తనకు చెందిఉండినఅధికారం లక్ష్మికి సంక్రమిస్తున్నదని వెంకాయమ్మ గుర్తించసాగింది. నాగభూషణంకూడా ఇంతకాలానికి లక్ష్మికి తన భార్యఅనే హెూదాఇచ్చాడు. మరెవ్వరూ వెంటలేకుండా లక్ష్మితో ఏఊరైనా వెళ్ళటమూ, కుటుంబ వ్యవహారాలు లక్ష్మితోకూడా చెప్పటమూ సాగించాడు. చాలా మంచిరోజులు వచ్చినట్టనిపించిందామెకు. తన పుట్టిల్లూ, అక్కడిజీవితమూ పూర్వజన్మ వృత్తాంతంగా కనిపించసాగింది.

కష్టాలల్లేనే సుఖాలూ ఒంటరిగారావు. లక్ష్మి గర్భవతిగాఉన్నట్టు రూఢిఅయింది.

తన సంతోషం కొత్తవాళ్ళతో పంచుకోవాలనే ఆదుర్దాకలిగి తమ్ముడికి శ్రమపడి వందతప్పులతో ఒక ఉత్తరం రాసింది—ఈసారి శలవులకు తప్పక రమ్మనీ, చదువుకునేందుకు పుస్తకాలు తెమ్మనీనూ.

కిష్టుడు అక్కకోరిక తీసివెయ్యలేకపోయినాడు. శలవులివ్వగానే వచ్చేశాడు. ఎంతో ఉత్సాహంతో లక్ష్మి తమ్ముడికి తన జీవితంలోఉన్న వైభవమంతా చూపించింది. కిష్టుడికి సంతోషంకలగటానికిబదులు ఏడుపొచ్చింది.

"ఏం జీవితం ఇది? నిన్ను చూడకుండాఉన్నా బాగుండేది. ఈ పశువులూ, ఈ చాకిరీ! ఒక కళలేదు, ఒక చదువు

లేదు. ఒకవిషయంగురించి చర్చించుకోవటం లేదు. దేశంలో ఏం జరుగుతున్నదో, జీవితం ఎట్లా మారుతున్నదో ఏమీ తెలీదు కద. కనిబొమలమీది వెంట్రుకలల్లే ఈ బతుక్కు ఎరుగూ, బొదుగూ, మార్పూ లేదు. ఎందుకీ డబ్బు? నీ కాడబ్బు ఒక మంచి బట్టఇస్తుందా, ఒక మంచి నాటకం చూపిస్తుందా, పాట కచ్చేరీ వినిపిస్తుందా? మట్టిరోడ్లూ, పొలాల్లో బయటికివెళ్ళటం, గొడ్లూ, పేడా-ఇవేగా ఎన్నాళ్లుగడిచినా!" అన్నాడు" కిష్టుడు.

"ఇదో పద్ధతీ!" అన్నది లక్ష్మి, మరేమీ అనలేక.

"మన ఊళ్లో చచ్చు ప్లీడరు గుమాస్తా పెళ్లాం నీకన్న ఎక్కువ ఆనందిస్తున్నది. నీకాసంగతి తెలుసా?''అన్నాడు కిష్టుడు కష్టంగా.

కిష్టుడు తనలో ఇట్లా అసంతృప్తి రేకెత్తించటం లక్ష్మికి బాధకలిగింది. ఇక్కడ తనకున్నసుఖం కిష్టుడు పంచుకునేది కాదని తేలిపోయింది. కాని వాడువచ్చి వారంరోజులన్నా ఉండకుండా పారిపోవటం లక్ష్మికి మరింత బాధకలిగించింది. మొదట వచ్చినప్పుడు పదిహేనురోజు లుంటానన్నాడు. ఆరు రోజులకే చాలివచ్చింది.

ఈ జీవితంమీద ఏదో అసహ్యం.లక్ష్మి హృదయంలో తలఎత్తటానికి ప్రయత్నించింది, కాని లక్ష్మి దాన్ని తొక్కిపట్టి గుండె రాయిచేసేసింది.

సరిగా వెంకటేశ్వర్లు లేచిపోయిన సంవత్సరానికి లక్ష్మి

ఒక ఆడపిల్లను కన్నది. లక్ష్మమ్మని పురిటికిపంపమని శివరామయ్య గారు అడిగాడుగాని నాగభూషణం ఒప్పుకోలేదు. పిల్లకు భ్రమ రాంబ అని పేరుపెట్టుకున్నారు.

పిల్ల పుట్టినాక లక్ష్మమ్మ జీవితం ఒక గాట్లో నడవసాగింది. అయిదు సంవత్సరాలు గడిచాయి. ఈలోపల లక్ష్మి జీవితం రెండుసార్లు గండి తప్పింది. భ్రమరకు రెండో యేడు వెళ్లుతుం దనగా కిష్టుడి పెళ్ళిఅయింది. మరో రెండేళ్ళకు శివరామయ్య గారు ఆకస్మికంగా మరణించాడు—గుండె ఆగిపోయింది. యోగీ శ్వరులు చచ్చే చావన్నారు అందరూ.

భ్రమరకు అయిదేళ్ళు నిండుతాయనగా నాగభూషణం పక్షవాతంతో మంచానపడ్డాడు. లక్ష్మికి కష్టకాలం తిరిగి ఆరం భమయింది.

## 13

ఒకనాడు జాముపొద్దెక్కి వెంకటేశ్వర్లు తిరిగివచ్చాడని పుకారుపుట్టింది. ఈవార్త ఆ పల్లెటూరునంతా ఒక్కసారి కల చివేసింది. పొద్దుటినుంచీ ఊరుబయట మర్రిచెట్టుకింద కూర్చు న్నాడనీ, బైరాగివేషంలో ఉన్నాడనీ, మొదట ఎవరూ గుర్తు పట్టలేదనీ, ఇప్పుడే ఎవరో పలకరించి గుర్తించారనీ, జనం చుట్టూమూగారనీ, అందరూకలిసి వెంకటేశ్వర్లును ఇంటికి తెస్తు న్నారనీ కబురు తెలిసింది.

చాలామందికి వెంకటేశ్వర్లు రాకవల్ల సంతోషమే కలి

గింది అతను వెళ్ళిపోయి ఆరేళ్ళయింది. ఆరేళ్ళకాలంలో పల్లెటూరివారు క్షమించలేని తప్పులుండవు. అయినా కొందరు, "మళ్ళీ ఊరికి శని దాపరించిందీ?" అని అనకపోలేదు.

లక్ష్మికిమటుకు వెంకటేశ్వర్లు వస్తున్నాడనేసరికి కలిగినది కోపమూకాదు, సంతోషమూకాదు, భయం. తానేదో తప్పుచేసినట్లూ, తన తప్పుని నిరూపించటానికి వెంకటేశ్వర్లు వస్తున్నట్టూ బాధపడ్డది.

వార్త తెలిసినతరవాత రెండుగంటలకుగాని వెంకటేశ్వర్లు ఇంటికిరాలేదు. కాషాయిబట్టలు కట్టుకున్నాడు. పావుకోళ్ళు ధరించాడు. నెత్తిన జుట్టూ గడ్డమూ పెరిగిఉన్నాయి. కనిబొమలమధ్య ఇంత కుంకంపెట్టాడు. ఎవరేదిచెప్పినా తల పంకిస్తాడు. ఒక అర్థంకాని నవ్వునవ్వుతాడు. అందరికేసి దేవుడల్లేచూస్తాడు.

తమ్ముడింతదూరం ఉండగానే వెంకాయమ్మ చేతులు చాచుకని ఎదురువెళ్ళి, "వచ్చావురా, వెంకన్నా? నువ్వు మళ్ళీ కనిపిస్తావనుకోలేదురా! నువ్వుపోతే ఊరంతా చిన్నబోయిందిరా! లేచిపోవటానికి నీకేం కర్మపట్టిందిరా! హాయిగా కాలిమీద కాలేసుకు కడుపులో చల్ల కదలకుండా కూచోకా!" అంటూ పెద్ద నాటకంఆడింది.

వెంకటేశ్వర్లు లోపలికి వస్తుండగా నడవలో నిలుచున్న లక్ష్మి వేటగాణ్ణిచూచిన లేడిలాగా అయిపోయి, కాళ్ళదగ్గిర

నిలబడిఉన్న కూతుర్ని చప్పున చంకలోకి ఎత్తుకున్నది. వెంకటేశ్వర్లు కాళ్ళు కడుక్కుని లక్ష్మికేసి చూసి విశాలంగా నవ్వి, తల పంకించి, "నారాయణ!" అంటూ లోపలికి అడుగుపెట్టాడు.

లోపల మంచంలో పడుకున్న నాగభూషణం తమ్ముడికేసి కళ్ళు నిప్పులుకక్కుతూ చూశాడు. వెంకటేశ్వర్లు ఈసారి నవ్వలేదు. తలమాత్రం పంకించి, "పురాకృతం! నారాయణ!" అన్నాడు...

కేశఖండనం మినహాగా వెంకటేశ్వర్లు మళ్ళీ మామూలు మనిషి అయిపోయినాడు. తెల్ల బట్టలు వేశాడు. చుట్టలు ప్రారంభించాడు. (అతను చుట్టలు మానాడనటానికి సాక్ష్యం ఏమీ లేదు.) ఇంటిపెత్తనం మీద వేసుకున్నాడు.

అతను వచ్చినాక లక్ష్మిస్థితి బొత్తిగా దుర్భరమయింది.

ఇప్పుడు వెంకాయమ్మ విశ్వరూపం చూపిస్తున్నది. వెంకటేశ్వర్లు శక్తులూ, వెంకాయమ్మ శక్తులూ ఏకమయేసరికి ఆ ఇంట్లో వ్యక్తిగతమైన గౌరవమూ, నోళ్ళకు హద్దూ పద్దులూ, మానమర్యాదలూ అంతరించాయి. ఇంటిపెద్దలుగా వాళ్ళిద్దరూ నోటికివచ్చినదల్లా అనేసే స్వాతంత్ర్యం ప్రకటించారు. అధికారాన్ని అన్నివిధాలా దుర్వినియోగపరిచారు. లక్ష్మిమీద వాళ్ళిద్దరూ త్రాచుపాము పగపట్టారు. వాళ్ళకి తనమీద అంతపగ దేనికో, వాళ్ళకు తనుచేసిన అపచారమేమిటో లక్ష్మి ఎరగదు.

"నువ్వు ఎందులోపడిచస్తే నాకేం?"... నీకిష్టంలేకపోతే ఈ ఇంటోనుంచి లేచిపో!...మాకు చెప్పటానికి నువ్వెవతెవే..? నీకీ యింటో అసలేం హక్కుంది? నువ్వు కన్నది ఆడపిల్లని, మొగపిల్లవాణ్ణికాను...ఆడపిల్లను కంటేనే ఇంత అదరిపడుతు న్నావు. మగ పిల్లవాణ్ణికని భాగం పంచుకునేదానివైతే బతక నిద్దువా? చచ్చినట్టు కుక్కినపేనల్లే పడిఉండు, ఏమిటను కున్నావో?"

ఈ ధోరణిలో వెంకాయమ్మ ప్రతిదానికీ, సందర్భం లేకుండా, ఏకరువుపెట్టేది. "నారాయణ" అని వెంకాయమ్మకి తమ్ముడు తాళంవేసేవాడు. ఇప్పుడు లక్ష్మికి తేళ్ళతోనూ జెర్రులతోనూ కాపరంచేస్తున్నట్టుందిగాని మనుషులలో కాప రంచేస్తున్నట్టులేదు...సత్యాన్ని తల్లితో మాట్లాడవద్దని ఆంక్ష పెట్టేశారు. లక్ష్మిని మొగుడి పరిచర్య చెయ్యటానికికూడా లేకుండాచేశారు.

"నేనీ యింటో బతికి ఎంతో కాలం ఉండను. నా గతి ఏమవుతుంది?" అనుకునేదిలక్ష్మి. "ఇంకా ఒక్కరోజైనా గడ పలేను. నాకు శక్తిలేదు. నా పని అయిపోయింది. రేపీపాటికి నాకు మతిపోతుంది." అనుకుంటూనే లక్ష్మి వారాలూ, నెలలూ గడిపింది. ఆమె నిప్పుడు గుర్తించటానికి లేదు. చిక్కి శల్యమయింది. నల్లబడిపోయింది. మొహాన కళా కాంతీ లేదు.

వెంకటేశ్వర్లు ఊళ్ళోవాళ్ళమీద తీవ్రమైన దాడి ప్రా

రంభించాడు. బాకీలన్నీ నిష్కర్షగా వసూలుచెయ్య నారంభించాడు. తాకట్టు ఆస్తులన్నిటికీ జప్తులు తెచ్చాడు. చేబదుళ్ళకు కూడా పత్రాలు రాయించుకుని, మంచితనంగా రాసి యిచ్చిన పత్రాలు పట్టుకుని కోర్టుకు వెళ్ళాడు.

నానాటికీ వెంకటేశ్వర్లు పైశాచికబలం పెరగసాగింది. అది ఎట్లా పెరుగుతున్నదో, దానికి ఊతం ఎక్కడనుంచి వస్తున్నదో ఆ పల్లెటూరి ప్రజలు తెలుసుకోలేకపోయినారు. వెంకటేశ్వర్లు తలుచుకుంటే రైతులు చేసే పొలాలు వొదులుకొని అడవుల్లో భూస్వామిని ముంచిపోతారు. వెంకటేశ్వర్లు కెవరమీదనన్నా ఆగ్రహంవస్తే వాళ్ళ పొలానికి నీరు దొరక్కపోవచ్చు. వాళ్ళ కుప్పలూ కొంపలూ కూడా కాలిపోవచ్చు. కాడీలను పోగుచేసి. ఓవర్ సీర్లకు లంచాలుపెట్టి. కరణాన్ని ఉసికొలిపి వెంకటేశ్వర్లు గ్రామంలో వర్ణనాతీతమైన అశాంతి రేపెట్టాడు. ఊళ్ళో ఎవరికీ ఘోరం జరిగినా అది వెంకటేశ్వర్లు పనే అని ప్రజలు నమ్మసాగారు. వాడు చేసేపను లన్నింటికీ ఒక జట్టు మనుషులే సహాయంగా వ్రను. కొన్ని విషయాలలో భూస్వాములు వాడి పక్షం, మరి కొన్నింటిలో బీదరైతులు వాడి పక్షం. మొత్తం అందరికీ అపకారం చేస్తూనే ఉన్నాడు. వాడి దెబ్బ తినేవాళ్ళే వాడి చేతిలో పనిముట్లల్లే కూడా ఉపయోగపడుతున్నారు. ఇది చాలక వాడు మంత్ర శక్తులు సంపాదించాడనీ, చాతబడులు చేస్తున్నాడనీ కూడా ఊళ్లో అంద

రికీ నమ్మకం. ఈనమ్మకం వాడికి బలమయింది.

వెంకటేశ్వర్లు తన బల్గం పెంచుకున్నకొద్దీ బలమైన శత్రువులనుకూడా చేసుకున్నాడు. వాళ్ళలో కోటయ్య బలాఢ్యుడు. అతను గ్రామస్తుల పొలాలు చేసేవాడు. అతనికింద అయిదారుగురు చిన్న రైతులుండేవాళ్ళు. కావటానికి కోటయ్య సొంతపొలం అయిదెకరాలే. కాని అతనికి చిన్నరైతుల్లో గొప్ప పలుకుబడి ఉండేది. మనిషికూడా భీముడు, ఒక్క గుద్దుకు ఎద్దునడుము విరగగొట్టగలడని కథలుగా చెప్పుకునేవాళ్లు. వెంకటేశ్వర్లు కోటయ్యకు చేసుకోవటానికి పొలందొరక్కుండా చెయ్యగలిగాడు. వెంకటేశ్వర్లును కాలికింద రాయటానికి కోటయ్య సమయంకోసం ఎదురుచూస్తున్నాడు.

ఈపరిస్థితిలో నాగభూషణం జబ్బు విషమించింది. వెంకటేశ్వర్లు రాకపూర్వం ఆయనకు అంతో ఇంతో వైద్యం ఉండేది. ఇప్పుడు అదీలేదు. లక్ష్మి డాక్టర్ను పిలిపించమని గోల పెడుతోంది; ఆలకించినవారులేరు. నాగభూషణం ఒకరోజల్లా కడప్రాణంతో ఉండి ఆఖరుకు మరణించాడు.

# 14

నాగభూషణం పోయిన ఆరోరోజుకుగాని కిష్టుడు రాలేదు. అతనికి ఒక కార్డుముక్క రాసినవాళ్ళులేరు. ఈ అయిదు రోజులనుంచీ లక్ష్మికి తిండిలేదు, స్నానంలేదు. రెండోరోజునుంచీ పైకి లేవటానికికూడాలేదు.

"అదివరకల్లా మొగుణ్ణిచూసి ఏమిఆటలుఆడినా ఆడింది. ఇప్పుడేంచేస్తుందో? తన ఆట కట్టిందనే ఆ బొల్లిఏడుపులు!... ఏడవగానేసరా? ఎవరన్నా నమ్మేట్టుండొద్దూ! ఒక కడుపున పుట్టినవాళ్ళకి లేనిదుఃఖం తనకొచ్చింది! చిన్న మొగుళ్ళను చేసుకున్నవాళ్ళుకూడా ఇంత ఏడవరు!...అబ్బో చాలామందిని చూశాం...అంత విడిచిఉండలేనిది చచ్చినవాడితోనే పోలేక పోయిందీ!..తిండి తినదూ!...పోనీ డొక్కమాడితే తనేతిం టుంది. లేకపోతే చాటుగానన్నా తింటుంది—ఇప్పుడు తినటం లేదనా?...అహ్హాహ్హాహ్హా!"

నాగభూషణం చచ్చాడని పరామర్శచెయ్యటానికి బోలె డంతమంది బంధువులు వచ్చారు. వారందరిఎదటా ఈ మాట లన్నీ పడటం లక్ష్మికి చచ్చినట్లున్నది. కిష్టుణ్ణి చూడగానే ఆమె బావురుమని ఏడిచింది. అదివరకల్లా అస్పష్టంగా మనస్సులో ఉన్న నిశ్చయం తమ్ముణ్ణిచూడగానే నోట వచ్చేసింది.

"నన్ను తీసుకుపో, కిష్టుడూ! నేనిక్కడవుండలేను, నాయనా"అని ఏడిచింది.

"పో, లేచిపో! నిన్నిక అడిగేవాళ్లెవరూ?" అని వెనక నుంచి వెంకాయమ్మ కేకపెట్టింది. తనకు లక్ష్మిమాట లెంతో తీరని అవమానం చేసినట్టు.

"పోనీవమ్మా శనిసీ! మళ్ళీ ఈ కొంపలో నేను బతికుం డగా అడుగుపెట్టవద్దను," అని వెంకటేశ్వర్లు కేకపెట్టాడు.

"అదే నేనూ అంటున్నాను. ఇప్పుడే వెళ్ళమను, ఈక్షణం! అసలా అబ్బాయి అందుకే వచ్చాడుగామాలు! ఉత్తరం రాయించిందిగామాలు! ఎంతకైనా తగ్గదేలే!" అన్నది వెంకాయమ్మ.

"నీ పెట్టె సర్దుకో! ఇప్పుడే పోదాం," అన్నాడు కిష్టుడు లక్ష్మితో.

"ఆవిడకో పెట్టెకూడానా? అట్లాగే వెళ్ళమను. మీరు పెట్టిన గుడ్డపేలికలు ఏనాడో పోయాయి. వేగిరం పదండి. ఏమైనా నష్టంటే చూసి పంపేస్తాలే!" అన్నది వెంకాయమ్మ.

"నా కేమీ అక్కర్లేదు పిల్లనుతీసుకో," అన్నది లక్ష్మి నీరసంగా.

"పిల్లా? ఏపిల్లో! దాన్నిముట్టుకుంటే చేతులు విరగేస్తాను. నీబాబు ఎవ రడ్డంవస్తాడో చూస్తాను!" అన్నది వెంకాయమ్మ.

"నా పిల్ల దాన్ని వదిలిపెట్టిపోను." అని ఏడిచింది లక్ష్మి.

కిష్టుడు మారుమాటలేకుండా భ్రమరను చంకెత్తుకొని, పద, నా కెవడిబాబు అడ్డంవస్తాడో చూస్తాను!" అన్నాడు.

"ఇద్దరూ పిల్లతోసహా ఇంటి బయటికివచ్చారు.

ఒక వస్తాదులాంటి మనిషి లక్ష్మిదగ్గరికివచ్చి భృత్యుడల్లే, "వెళ్ళిపోతున్నావా, మా యమ్మా?" అన్నాడు.

"కోటయ్యవా, నాయనా?...నాకిక్కడింకేముంది? పోక ఎందుకూ?" అంది లక్ష్మి.

"నీ నగలూ, గుడ్డలూ ఏయమ్మా?"

"అవే తక్కువయినై!......ఇవ్వమన్నారు."

"ఆఁ, అదేంమాట? ఈకపోవటమంటే ఎట్టాటిది? అడ గాల్చినట్టడిగితే ఈకేం జేస్తారేట్టా?...ఇదుగో, యెంకమ్మా!" అంటూ కోటయ్య ఇంటో కెళ్లాడు. మరో నలుగురు మనుషులు వీధిలోనుంచి ఆవరలోకివచ్చి లక్ష్మికి సమీపంలో నిలబడ్డారు. వాళ్ళు కోటయ్య మనుషులని లక్ష్మి గ్రహించింది. కాని కిష్టు డికిమాత్రం ఇదంతా ప్రమాదకరంగా కనిపించింది.

"ఆ కోటయ్యను నిష్కారణంగా తొందరపడవద్దను, నరసింహులూ! నేను పోతాను!" అన్నది లక్ష్మి.

"కాస్త తాలవమ్మా ఒక్కఛనం!" అన్నాడు నరసింలు.

కోటయ్య మరో పదనిమిషాలకు విశాలంగా నవ్వుతూ ఒకచేతిలో పెద్ద పెట్టా, మరోచేతిలో పెద్ద మూటా తెచ్చాడు.

"నీ నగలన్నీ ఈపెట్టెలో యెట్టా. అందిన గుడ్డలన్నీ మూటగట్టాం. ఆరి వేయన్నావొచ్చిడుంటే ఆనికచూసి పంపీ యమ్మా. ఆరిసొమ్ము మనకెందుకు?" అన్నాడు కోటయ్య కిష్టుడికేసి కన్నుమలిపి నవ్వుతూ.

కోటయ్య అనుచరులెవరో ముందుగానే ఏర్పాటుచేసి ఉండాలి. వాకిట్లో ఒక రెండెడ్లబండి సిద్ధంగాఉంది. కోటయ్య లక్ష్మి సామాను తెచ్చి బండిజల్లలోపెట్టాడు. లక్ష్మి బండిలో ఎక్కి పడుకుంది. పిల్లను ఎక్కించి కిష్టుడు బండివెనక నడవసా

గాను. కోటయ్యా అతని మనుషులూ కిష్టుడితో పాటు బండివెంట నడవసాగారు.

ఊరిబయటికి వచ్చేలోపుగా బండిచుట్టూతా ఓ వంద మందిచేరినట్టు చేరారు. ఆడవాళ్లూ మగవాళ్లూనూ, అందరూ లక్ష్మినిచూసి జాలిపడి, వెంకాయమ్మనూ, వెంకటేశ్వర్లునూ తిట్టేవాళ్ళే. ఊరివాళ్ళకు తనమీద ఇంత అభిమానం ఏర్పడిందని లక్ష్మి కలలోకూడా అనుకోలేదు. అంత నీరసంగా ఉన్నా ఆమె కెంతో సంతోషం కలిగింది ఇదిచూసి.

ఊరిబయట వెంటవచ్చినవారంతా ఒక్కొక్కరే జారారు. కాని కోటయ్యా ముఠామాత్రం వెళ్ళిపోలేదు.

"ఇక మీరుండండి. పాపం, చాలా మేలుచేశారు. మీ పుణ్యాన మా అక్క బయటపడగలిగింది. మీరుండండి," అన్నాడు కిష్టుడు.

"రోడ్డెక్కేదాకావస్తాం. పాపిష్టి ముండాకొడుకులతో పని," అన్నాడు కోటయ్యా.

కోటయ్యా చెప్పిందంతా జరిగింది. ఊరికి ఒక మైలు దూరాన పంటకాలవ లాకుదగ్గర అయిదారుగురు మాలవాళ్లు కర్రలతోసహా కనిపించారు.

"నీటిపాములు పట్టటానికొచ్చారా, ఏందిరా, యేసూ?" అని కేకేశాడు. కోటయ్యా.

"యేం, లేదులే," అంటూ యేసు తలకున్న గుడ్డవిప్పి

మళ్ళీ చుట్టుకున్నాడు.

"భద్రంగాఉండండి, యదవనాయాళ్ళారా!" అని హెచ్చరించాడు కోటయ్య.

మరో గంటకల్లా బండి రోడ్డెక్కింది.

## 15

లక్ష్మి మామూలు మనిషి కావటానికి మూడు నెలలు పట్టింది. కిష్టుడి పెళ్ళాం కాపరానికివచ్చింది. చిన్నపిల్ల. ఇంటి పనిఏమీ చేతకాదు. చిన్నచిన్న పనులకుకూడా రొష్టుచేసుకొనేది. ఆపిల్ల ఆడపిల్లల బడిలో ఇంగ్లీషు అక్షరాలవరకూ చదివి చాలించింది. ఆమెకు చదువులేకపోయిందనే విచారంలేదు. ఆడజన్మకు చాకిరి—ఏవిధమైన చాకిరీ-లేకుండాఉండటమూ, మొగుడితో ఏకాంతంగా రాత్రింబగళ్లు గడపటమూకన్న చరితార్థత లేదని ఆమె విశ్వాసం. కిష్టుడు ఒక వంటమనిషినీ ఒక పనిమనిషినీ పెట్టగలిగితే నిజానికి తన జీవితం స్వర్గతుల్యం అనుకుని ఉండేదే. కాని. కిష్టుడికి పొలంమీాదవచ్చేది తినటానికి సరిపోతుందిగాని ఇటువంటి ఖర్చులకుచాలదు. అతను బియ్యే పాసయి ఉద్యోగంలేకుండా కూర్చున్నాడు. మొగుడికి ఉద్యోగం లేకపోయిందనే విచారం జానకికిలేదు సరిగదా, అవుతుందేమోననే భయంకూడావుంది. లక్ష్మి, లక్ష్మి కూతురువచ్చి ఇంటో ఉండడం జానకికి నచ్చలేదు. వాళ్ళిద్దరూ తన ఆనందానికి అడ్డం వచ్చినట్టు ఆమె భావించింది. అయితే ఈసంగతి లక్ష్మి చాలా

కాలం గ్రహించలేదు.

కిష్టుడు వెంకటేశ్వర్లుమీద లక్ష్మి మనోవర్తికోసం వ్యాజ్యంవేశాడు. వెంకటేశ్వర్లు మధ్యవర్తుల పరిష్కారంతో లక్ష్మికి రెండెకరాలు రాసియిచ్చాడు. లక్ష్మికి యావజ్జీవమూ, పిల్లకు పెళ్ళి అయ్యేవరకూ తిండి వగైరాలకోసమూ, పిల్ల పెళ్లి ఖర్చులకూ కలిసి ఆ రెండెకరాలూ ఇచ్చాడు. కిష్టుడు ఈ పరిష్కారానికి ఒప్పుకోదలచలేదు గాని మధ్యవర్తులు అతన్ని ఒప్పించారు.

లక్ష్మి తన కూతురువిషయం ఒక నిర్ణయానికివచ్చింది. తన అనుభవాలేవీ పిల్లకు కలగరాదని నిశ్చయించింది. ఆమెకు చదువూ, కావలిస్తే సంగీతమూ చెప్పించాలనుకున్నది. తన నగలన్నీ అమ్మిఅయినాసరే తన పిల్ల జీవితం సుఖమయంగా చెయ్యాలనుకున్నది. ఆ ఉద్దేశంతోనే కిష్టుడిచేత తన నగలు అమ్మించింది. తీరా డబ్బు చేతికివచ్చినాక ఇళ్ళ స్థలాలు కొనమని ఒకరిద్దరు ప్రోత్సహించారు.

"రామవరప్పాడు దగ్గిర మా బావమరిది నాలుగువందలగజాలు కొన్నాడు. ఇప్పుడు దానిఖరీదు రెట్టింపయింది. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. కొంచెం దూరంగాకొంటే ఇప్పటికీ సెంట్లలెక్కన జాగా దొరుకుతున్నది," అని ఒకరు సలహా చెప్పారు.

"పోనీ పిల్లపేరఉంటుంది. ఇళ్ళస్థలాలన్నతరవాత కొన్న

ఖరీదు రాకపోతుందా? నాకో అర ఎకరం కొనిపెట్టు," అన్నది లక్ష్మి తమ్ముడితో. కిష్టుడు వెళ్ళి లక్ష్మి నగలమ్మిన డబ్బుతో నలభై సెంట్లు స్థలం కొనగలిగాడు.

లక్ష్మికి రెండెకరాలమీదా శిస్తులూ అవీపోను ఒక నూరు రూపాయలు వచ్చేవి. అవి తనకూ పిల్లకూ తిండికే సరిపోయేవి న్యాయానికి పిల్ల చదువుకూ సంగీతానికీ కిష్టుడే భరించేవాడు. అయితే లక్ష్మి వచ్చినప్పటినుంచీ జానకికి ఇంటిపని బెడద లేకుండాపోయింది. కాని జానకికి ఆవిషయం కృతజ్ఞతే ఏమీ లేకపోయింది.

చాలా కష్టపడ్డమీదట కిష్టుడు ఊళ్ళోబడిలో ఒక సంవత్సరంపాటు మేష్టరు ఉద్యోగం సంపాదించాడు. అదృష్టవశాత్తూ రెండుమూడు ట్యూషన్లుకూడా దొరికాయి. వాటితో అతని ఆర్థికస్థితి ఒక గాట్లోపడ్డది.

జానకి తనని పరాయిమనిషల్లే చూస్తున్నదని లక్ష్మి కనిపెట్టింది. ముఖ్యంగా భ్రమరమీద జానకి విసుక్కున్నప్పుడల్లా లక్ష్మికి కష్టంగాఉండేది. భ్రమర చదువుకుంటుంటే జానకి బొత్తిగా ఓర్చలేకపోయ్యేది, ఏదో పనిచెప్పేది. అయినా లక్ష్మి జానకిని గురించి మనస్సు కలతపెట్టుకోదలచలేదు. వెంకాయమ్మతో అనుభవం అయినమీదట ఇటువంటి వోర్చుకోవటం లక్ష్మికి అవలీలఅయింది.

లక్ష్మి కిష్టుడిదగ్గిరికివచ్చిన అయిదునెల్లకి ఒకనాడు కోట

య్యా లక్ష్మిని చూడవచ్చాడు. ఒక బుట్టనిండా వంకాయలూ, బెండకాయలూ, ఒక పెద్ద సొరకాయ తెచ్చాడు.

కోటయ్యను చూడగానే లక్ష్మికి అప్పుడే చూసినట్టు ప్రాణంలేచివచ్చింది.

"ఏం కోటయ్యా? అంతా కులాసా?" అని అడిగింది లక్ష్మి.

"ఏం కులాసామ్మా? మీ యెంకయ్యని శితకబాడి చారుగా! మంచాన పడుండాడు," అన్నాడు కోటయ్య విశాలంగా నవ్వుతూ.

"ఎప్పుడు? ఏం జరిగింది?" అన్నది లక్ష్మి ఆదుర్దాగా.

"ఏమో, ఎవరు చూశారు? ఓ రోజు చీకటిపడి బయలుకెళ్లాడు. నలుగురు మనుసులు అమాంతం మీదబడనున్నా గొడ్డును బాదినట్టు బాది వొదిలిపెట్టారు, మోకాలు డిప్ప ఊడిందనుకో. వొంటినిండా కర్రపోట్లే. చిత్తయిపోయాడు మడిసి. దెబ్బలమాటేంది గాని శానావరకు జారిపొయ్యాడు. వెనకటంత పెడసరంగా మాట్లాడ్డు. ఎల్లి సూశా, కొట్టారనీ చెప్పకు నేడిశాడు. పొగరుబోతు కేమవుద్దన్నా. బుద్దిగలి గుండమన్నా. అంతా పదిరోజులయింది. అట్టనే మీ ఆడబొడుచు కూడా తొంటె యిరిగిందిగా! ఇన్నా? ఏంలేమతే. బావిదగ్గిర జారిపడ్డది," అని చావుకబుర్లన్నీ చల్లగా చెప్పాడు కోటయ్య.

లక్ష్మికి ఈ వార్త వినగానే కలిగిన విచారం క్రమంగా హృదయంలోకి ఇంకటానికి బదులు క్రమంగా, ఇగిరిపోయింది. కొంతసేపటికి ఆమెలో విచారంగాని సంతోషంగాని ఏదీ మిగలలేదు. ఏవరో స్వల్ప పరిచయులకు కలిగిన కష్టాలు వింటే ఏమవుతుందో లక్ష్మికి అదే అయింది.

## 16

కృష్ణుడు మరుసటి ఏడు ట్రెయినింగుకు వెళ్ళాడు. ఆ మరుసటి ఏడు మళ్ళీ పంతులుపనిలో ప్రవేశించాడు. ఈసారి ఉద్యోగం 65 రూపాయలమీద ఖాయం అయింది. మరో 50 రూపాయలకు ప్రైవేట్లు దొరికాయి. అతని పని చాలా బాగుంది. జానకి పనికూడా చాలా బాగుంది. ఇంటో వంటపనిపికి లక్ష్మిఉంది. పనిమనిషిని కూడా పెట్టుకున్నారు.

భ్రమర మగపిల్లలబడికిపోయి చదువుతూఉంది. సంగీతం నేర్చుకుంటూ ఉంది. ఆ పిల్లకు ఇప్పుడే తల్లిపద్ధతులకన్న జానకి పద్ధతులు ఇష్టం. ఇంటిపని చెయ్యటమంటే రోత. సరదాలిష్టం. చదువులో తెలివిగలదాన్ననీ, సంగీతం బాగా పాడతాననీ గర్వంకూడా ఉంది. నిజానికి లక్ష్మి గొంతులో ఉన్న సుఖంగాని, పాడటంలో అసక్తిగాని భ్రమరకి లేవు. ఆ సంగతి భ్రమర ఎరుగదు. ఒకనాడెప్పుడో లక్ష్మి వంట ఇంటో సన్నగా పాడుకుంటుంటే భ్రమర విన్నది. వెంటనే వెటకారంగా నవ్వి, "అబ్బో, నువ్వు పాడతావే!" అన్నది. అని తల్లిపాట తన

పాటకంటె బాగున్నదేమో నని అనుమానం కలిగి భ్రమరకు చాలా అసూయవేసింది. భ్రమర నవ్విన నవ్వులో అసూయ. ఉన్నదని లక్ష్మికి తోచింది. ఆతరవాత ఆమె ఎప్పుడూ నోరెత్తి సన్నగాకూడా పాడుకోలేదు.

అందరి దృష్టిలోనూ కిష్టుడు బాగుపడ్డట్టు కనిపించిన ప్పటికి అతనికి రెండేళ్ళకో పిల్లో పిల్లవాడో కలుగుతూ వచ్చారు. గంపెడు సంసారమయింది. భ్రమర స్కూలుఫైనలు పరీక్షకు కూర్చుని పాసయింది. ఆమెకు చిన్నతంలోనే పెళ్ళి చెయ్యాలని జానకి పట్టుపట్టింది గాని లక్ష్మి ఒప్పుకోలేదు.

"ఇప్పుడందరూ పెద్దయినాకనే పెళ్ళిళ్లు చేసుకుంటున్నారు. నన్ను వెలివేస్తారని నాకేమీ భయంలేదు. దాని ఇష్టమైతే అది చదువుకుంటుంది. అంతగా అయితే రామవరప్పాడు స్థలం అమ్మేస్తాను." అన్నది లక్ష్మి. కిష్టుడు లక్ష్మిని బలపరిచాడు.

భ్రమర సంగతి ఏమవుతుందో నిజంగా లక్ష్మికి తెలియదు. తనకూతురి జీవిత నిర్ణయాలు చేసే శక్తి సామర్థ్యాలు తనకు చాలవని లక్ష్మి గుర్తించింది. కాలేజీ చదువు చదివించడానికి చాలా డబ్బు కావాలి. స్థలం అమ్మి పిల్లను చదివించినా ఎప్పుడోప్పుడు పెళ్ళి చేసుకోవలిసిందేగాని పిల్ల ఉద్యోగాలు చెయ్యబోదు. ఆడవాళ్ళకు దొరికే ఉద్యోగాలన్నీ అవి నీతికరమైనవనే లక్ష్మి విశ్వాసం.

ఈ సమస్యలన్నీ లక్ష్మి భ్రమరతో చర్చించింది. భ్రమ రకు చర్చలంటే తలనొప్పి. తల్లితో చర్చించటం మరీ విసుగు. జానకే తనజీవితం గురించి మాట్లాడటానికి పనికిరాదనీ, జాన కితో పోలిస్తే లక్ష్మి మరీ అనాగరిక వ్యక్తి అనీ భ్రమర విశ్వాసం.

"నాకు చదువక్కర్లేదు...ఏదో చేద్దాంలే!" అన్నది భ్రమర.

ఒకనాడు అకస్మాత్తుగా భ్రమర మాయమయింది. తన మేనమామకు ఒక ఉత్తరం మటుకు ఉంచి వెళ్ళిపోయింది.

"నన్ను గురించి మీరు విచారించవద్దు. వెతకవద్దు. నా జీవితం నేను జీవించదలిచాను. మా అమ్మకు చెబుదునుగాని ఆవిడ అర్థం చేసుకోదు. నేనేమీ తప్పుడు పనులు చెయ్యటం లేదు—భ్రమర."

ఈ ఉత్తరం చూసుకుని లక్ష్మి బావురుమని ఏడిచింది. ఆమెకీ విషయంలో కలిగినంత సంతాపం అదివర కెన్నడూ కలగలేదు. ఎందుకంటే ఈ సంతాపంలో పశ్చాత్తాపం కూడా కలిసివచ్చింది.

"నేను దాన్ని సరిగా పెంచలేక పోయినాను. నామీద దానికి గురిలేకుండా చేసుకున్నాను." అన్నది లక్ష్మి.

భ్రమర ఒక యువకుడివెంట పట్నం వెళ్ళింది. ఆ యువకుడు తన పరిభాషలో భ్రమరను "ప్రేమించాడు." అతను

కూడా భ్రమరకోసం తన బంధువుల్ని "త్యాగం" చేశాడు. తండ్రికి చెప్పకుండా ఏడువందల రూపాయలు పట్టుకుని బయల్దే రాడు. ఈడబ్బు అయిపొయ్యేలోగా భ్రమరకి సినిమాలో మంచి ఛాన్సువస్తుందనీ, ఆతరవాత అంతా సుఖంగా ఉండవచ్చుననీ ఇద్దరూ రహస్యంగా అంచనా వేసుకున్నారు. రైలులో అతను భ్రమరచెవిలో, "లోకముతో మన కేటికి లోలాక్షి రా పోదము" అని పాడాడు.

భ్రమరను మనం తప్పుపట్టనవసరం లేదు. ఆమెలో ఉన్న అస్పష్టమైన స్వాతంత్ర్యకాంక్షా, ప్రేమనుగురించి ఆమెకున్న విశ్వాసాలూ ఆమెను బలపరిచాయి. పత్రికల్లో వస్తున్న ప్రణయసాహిత్యమూ, ప్రణయగీతాలూ ఆమెను సమర్థించాయి. ఈపని చెయ్యటంవల్ల ఆమె తననుచూసి తాను గర్వించుకున్నది. తనను తాను గౌరవించుకున్నది. ఆమెకీపని చెయ్యటంవల్ల అపరిమితమైన ఆనందం కలిగింది గాని బాధకలగలేదు.

లక్ష్మి తన జీవితాన్ని తన సంస్కారంతో సంస్కరించాలని ప్రయత్నం చెయ్యలేదు. జీవితాన్ని జయించాననే భావం ఆమె కెన్నడూ కలగనేలేదు. ఈపని చెయ్యటంకోసం నేను నాకుగల సమస్తమూ త్యాగంచేస్తానని ఆమె ఎన్నడూ నిశ్చయించుకోలేదు. అన్నిటికన్నా ఎక్కువైనదేమంటే ఆమెకు నిజమైన ఆనందం—ఎంత అపసవ్యంగాగానీ—ఎన్నడూ కలగలేదు. అందుచేత తన కూతుర్ని గురించి లక్ష్మి విమర్శించే లాభంలేదు.

మూడునెలలపాటు భ్రమరా ఆమె ప్రియుడూ కలిసి ఆకాశాన, స్వర్గంలో, మబ్బులమీద విహరించారు. దగ్గిరఉన్న డబ్బు అందుకు వినియోగించింది. కాని, డబ్బు అయిపోయింది. అయినా భ్రమర ఆమూడునెల్లూ అనుభవించిన ఆనందాన్ని ఏఆర్థిక శాస్త్రవేత్తా తుడిచివెయ్యలేడు.

భ్రమర సినిమాకంపెనీలకి పోయింది. కొందరు ఆమె మొహానికీ పెదవులకూ రంగువేసి, గరగరలాడే చౌక చీరెలూ, ధగధగలాడే చౌక నగలూ పెట్టి ఫోటోలు తీశారు. ఒక పెద్ద మనిషి తను తీయబోయే చిత్రంలో తప్పక వేషం ఇస్తానని వాగ్దానంచేసి ఆమెను ఒంటరిగా బీచికి షికార్లుకూడా తిప్పాడు. స్నేహితంలో ఆ పెద్దమనిషి తీసుకున్న చనువులకు భ్రమర అభ్యంతరం చెప్పలేదు. ఆమె హృదయం అదివరకే తన ప్రియుడికి దత్తమైఉంది. దాన్ని ఏ హొలీవుడ్ మ్యాసనూ అపహరించలేడు.

అయితే తన ప్రియుడు ఈపాటి అర్థం చేసుకోలేకపోతాడని భ్రమర అనుకోలేదు. అతను భ్రమరతో పోట్లాట ప్రారంభించాడు. "నువ్వు సినిమాల్లో వెయ్యకపోతేమానె, మనం ఇంకేదన్నాచేసి డబ్బు సంపాదింతాం. నువ్వు వాడితో షికార్లు వెళ్ళకు." అన్నాడు.

"ఇదుగో వందరూపాయలు. నా వేషానికి ఎడ్వాన్సు. నువ్వు చాదస్తంగా మాట్లాడకు. ఇంకా నాకు పేరురాకముందే

ఇట్లా అసూయపడుతున్నావు. రేపు నేను పెద్ద స్టారునయితే ఏంచేస్తావు?" అన్నది భ్రమర.

ఒకరోజు చెప్పకుండా భ్రమర ప్రియుడు ఇంటికి వెళ్ళిపోయాడు.

"నీకేమీ ఫరవాలేదు. నీకు కావలసిన ఏర్పాట్లన్నీ నేను చేస్తాను," అన్నాడు ప్రొడ్యూసరు.

పట్నంలో ఒక దరిద్రపు ప్రాంతంలో ఒక చిన్న డాబా పదిహేనురూపాయలకు అద్దెకుతీసుకుని భ్రమరను అందులో ఉంచాడు. వంటసామగ్రి అదీ కొనిపెట్టాడు. ఆమెను వంటచెయ్యమన్నాడు. తనకు వంటరాదన్నది భ్రమర. నేర్చుకోమన్నాడు ప్రొడ్యూసరు.

అతను తీసే చిత్రంలో భ్రమర వేషంవెయ్యలేదు.

నాన్సెన్స్! నా వైఫ్‌ను వేషంవెయ్యనిస్తానా? డామ్ షేమ్! చౌకముండలందరితోటి కలిసి వేషంవేస్తావా? ఛీ, ఛీ!" అన్నాడు.

ఆ పెద్దమనిషికి అదివరకే ఒకవైఫూ కొందరు కిడ్సూ ఉన్నట్టు భ్రమరకు తెలిసివచ్చింది. నలభైఏళ్ళవాడికి భార్యాపిల్లలుంటారని ఆమెకు తెలిసేఉండవచ్చు. కాని వాళ్ళంతా వచ్చి ఈ డాబాలో కాపరంపెడతారనీ, ప్రొడ్యూసరుగారి మొదటిభార్య తనని అనరానిమాటలన్నీ అంటుందనీ భ్రమరకు తెలియదు.

అయితే ఆమెకు విప్లవమూ. తిరుగుబాటూ గురించి కొద్దిగా తెలుసు. ఒకనాడు హోమియోపతీ వ్యాసగుగారు ఇంట్లోలేనివేళ భ్రమర ఇల్లువదిలి పారిపోయి తల్లిదగ్గిరకు వచ్చేసింది.

ఇంటికివచ్చినతరవాత తన కూతురు గర్భిణిగాఉన్నట్టు లక్ష్మి గ్రహించింది. ఆమె ఆవేదనకు అంతులేదు. జానకి చాలా అల్లరిచేసింది. కిష్టుడు బుద్ధిమంతుడల్లే ప్రవర్తించాడు.

"నీ కేమీ భయం అవసరంలేదు. మీ ఇళ్ళస్థలం ఇవాళ అధమం ఇరవై వేలుచేస్తుంది. మొగుడికోసం పత్రికల్లో వేద్దాం," అన్నాడు. లక్ష్మి ఏమీ చెప్పలేకపోయింది.

ప్రకటనచూసి చాలామంది రాశారు. వచ్చి చూశారు కూడాను. అంతా నాసిరకమే. భ్రమర, చచ్చినా వాళ్ళను చేసుకోను, అని మొండితనంచేసింది. ఆఖరు కొక కుర్రవాడు వచ్చాడు. చూడటానికి బాగాలేడు కాని కుర్రవాడు, చాలా విశాలహృదయం ప్రకటించాడు.

"నాకు నీతిలో నమ్మకంలేదు, ఈ అమ్మాయి ఎవరితోనో లేచిపోయిందని విన్నాను. నాకేమీ అభ్యంతరంలేదు. నాకు స్త్రీ స్వాతంత్ర్యంలో విశ్వాసముంది. నేను చేసిన పనులకన్న ఈ అమ్మాయి చెడ్డపనులు చేసిఉండదు. నేను ఈ పిల్లను చేసుకుంటాను... ఆ స్థలంతాలూకు పత్రాలూ అన్నీ నేను చూడవచ్చునా?" అని అడిగాడు.

ఈ కుర్రవాణ్ణిచూస్తే లక్ష్మికి చాలా అసహ్యంవేసింది.

కాని భ్రమర ఒప్పుకున్నది. వివాహం అయిపోయింది. తల్లి కున్న రెండెకరాలూ, స్థలమూ పిల్లపేర రాసిస్తే నేగాని పెళ్ళికి ఒప్పుకోలేదు కుర్రాడు.

లక్ష్మి తటపటాయించింది.

భ్రమర తల్లిమీద విసుక్కొని, "నీ సంగతే ఆలోచిస్తావు. నా సంగతి ఆలోచించవు. నువ్వెప్పుడూ ఇంతే!" అన్నది.

లక్ష్మి తనకున్నదల్లా కూతురిపేర పెట్టింది.

తనగతి ఏం కావాలి? తన కింకా ముప్పైమూడేళ్ళు. అప్పుడే తన జీవితం అయిపోయింది. తన కూతురి జీవితంకూడా కొద్ది సంవత్సరాల్లో అయిపోతుంది, ఆ పొలమూ, స్థలమూ అమ్ముకుని వాడిదారిన వాడు లేచిపోతాడు. భ్రమర ఒక ఆడపిల్లతో వీధిలో నిలబడుతుంది. భ్రమరకు పుట్టేది ఆడపిల్లేనని లక్ష్మికి రూఢిగా తెలుసు. తనకింకా నడివయస్సు దాటక మునుపే మూడు తరాలవాళ్ళు వీధిలో నిలబడతారు!

"భగవంతుడా, మాకేది దిక్కు," అని ఏడిచింది లక్ష్మి.

భగవంతుడు పలకలేదు.